జీవితం నిజాయితీ పరులని ఎడిపిస్తుంది...
నిందలు వేసేవారిని నవ్విస్తుంది...
మాటకు కట్టుబడి ఉండే వారిని అవమానిస్తుంది...
మాటలు మార్చేవారిని గౌరవిస్తుంది..

నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 37 శనివారం, నవంబర్ 01, 2025 , పేజీలు - 12 వెల : 2/-

## కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే సంక్షేమం

- జూబ్లిహిల్స్‌లో దీపక్‌రెడ్డి విజయం తథ్యం
- బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్





**చర్చ, జూబ్లిహిల్స్:** కేంద్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శుక్రవారం తాండ్ర వినోద్ రావు బోరబండ ప్రాంతంలోని 376, 377, 378 బూత్‌లలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం తథ్యమని, కమలం గుర్తుకు ఓటువేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను నయవంచనకు గురిచేస్తున్నాయని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై అవగాహన ఉన్న దీపక్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ విజయం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టులా ఉండాలని మిగతాది 2లో...

## దేశ ఐక్యత, సమగ్రతను కాపాడతా





ఐక్యతా ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ

సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్‌కు ప్రధాని మోదీ నివాళి

**న్యూఢిల్లీ అక్టోబర్31 :**
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మిగతాది 2లో...

## అమెరికా-భారత్ మధ్య రక్షణ ఒప్పందం

ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం

పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం

రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి



**న్యూఢిల్లీ అక్టోబర్31 :**
అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. మిగతాది 2లో...

## హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను రోడ్డుపాలు చేస్తున్నారు

**జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ రోడ్డు షో... కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం**

హిట్లర్ నశించడం చూశామని, కాంగ్రెస్ ఎప్పటి వరకు ఉంటుందో చూస్తామని వ్యాఖ్య

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దెబ్బపడితే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదన్న కేటీఆర్



**హైదరాబాద్,అక్టోబర్31**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అభ్యర్థి మాగంటి సునీత తరపున రోడ్డు షో నిర్వహించారు. మరో పది రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఓటింగ్ జరగనున్నందున, ఆయా పార్టీల ప్రచారం ఊపందుకుంది. మిగతాది 2లో...

## క్యాబినేట్ హోదాతో సలహాదారులుగా

### సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు

కేబినేట్ కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు



**హైదరాబాద్,అక్టోబర్31 :**
సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ మిగతాది 2లో...

## బాధితురాలినే పెళ్లాడిన దోషికి శిక్ష రద్దు!

పోక్సో కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు...

దోషికి పడిన పదేళ్ల శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అసాధారణ అధికారాలను వినియోగించిన ధర్మాసనం

నిందితుడు బాధితురాలినే వివాహం చేసుకుని, బిడ్డకు తండ్రయిన వైనం



2లో.

## భౌతికంగా హాజరుకావాల్సిందే

వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు

వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ




2లో.

## ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

: జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి ప్రచారం

చనిపోతే పోటీలో నిలబెట్టవద్దనే



**హైదరాబాద్,అక్టోబర్31** తెలంగాణ ముఖ్యమంత్రి రేవ ంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్ని కల ప్రచారంలో పాల్గొన్నారు. వెంగళరావు నగర్‌లో కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమ ంత్రి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో పోటీ పెట్టకూడదనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. మిగతాది 2లో...



## మంత్రిగా అజారుద్దీన్

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు




**హైదరాబాద్,అక్టోబర్31:** తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. మిగతాది 2లో...

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడతా

**(మొదటి పేజీ తరువాయి)**
గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నర్మదా నది ఒడ్డున ఉన్న 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద సర్దార్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి.ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఏక్తా శపథ్' (ఐక్యతా ప్రతిజ్ఞ) చేశారు. "దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటానికి నా జీవితాన్ని అంకితం చేస్తానని ఈ రోజు ప్రతిజ్ఞ చేస్తున్నాను. జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఈ ప్రమాణం స్వీకరిస్తున్నాను. దేశ అంతర్గత భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటాను'' అని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు ఈరోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రధాని మోదీ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్'ను వీక్షించారు. ఈ పరేడ్‌లో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ సహా వివిధ రాష్ట్రాల పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పటేల్‌కు నివాళులర్పించారు. "సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత్ ఆయనకు నివాళులర్పిస్తోంది. దేశాన్ని ఏకీకరణ చేయడంలో ఆయన కీలక శక్తిగా నిలిచారు. జాతీయ సమగ్రత, సుపరిపాలన, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు.అనంతరం విడుదల చేసిన వీడియో సందేశంలో భారతదేశ ఏకీకరణ శిల్పిగా పటేల్‌ను అభివర్ణించారు. "భావజాల విభేదాలు ఉన్నవారితో కూడా కలిసి పనిచేసి, ప్రజలను ఏకం చేయడంలో సర్దార్ పటేల్‌కు సాటిలేని సామర్థ్యం ఉంది. ఆయన ప్రతి చిన్న విషయాన్ని గమనించి, దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి, సంస్థానాలను దేశంలో విలీనం చేసి, భిన్నత్వంలో ఏకత్వం అనే మంత్రాన్ని భారతీయులలో మేల్కొల్పారు" అని ప్రధాని వివరించారు.భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

# వరంగల్ వరద ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు.నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే సంక్షేమం



**(మొదటి పేజీ తరువాయి)**పిలుపునిచ్చారు. ప్రతీ బీజేపీ కార్యకర్త దీపక్‌రెడ్డి గెలుపులో భాగస్వామి కావాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సీతారాం నాయక్, సోప్పరి క్రాంతి, తాతపూడి అనిల్, దోమల రమేష్, కిరణ్, బూత్ అధ్యక్షులు సూర్య కుమార్, నరసింహ, హనుమంతరావు, శ్రీధర్, వెంకట్, రాజేష్ యాదవ్, ప్రశాంత్, అరుణ్, రాహుల్ యాదవ్, లల్లు, జిత్తుగుప్త, పాల్గొన్నారు. .




# తెలంగాణలో సోలార్ విద్యుత్‌కు నైవేలీ పెట్టుబడులు

## కెసిఆర్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్31: నైవేలీ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణలో రూ.10,000 కోట్ల పెట్టుబడులతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించి, ఈ పెట్టుబడులకు సహకరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ సంవత్సరానికి సగటున 9.8 శాతం పెరుగుతోంది. 2030 నాటికి రాష్ట్రానికి 33,773 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని చెప్పారు. అయితే, రాష్ట్రంలోని డిస్కంలు (విద్యుత్ పంపిణీ సంస్థలు), పవర్ ప్రొడక్షన్ యూనిట్లు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో కొనసాగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.30,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి రూ.42,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్లే కార్మికులు ఇబ్బందులు




పడుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వం వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆమన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల ఉత్పత్తిలో 74 శాతం థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి అవుతోందని చెప్పారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రాల వద్ద 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లోనే సోలార్ పంప్ సెట్లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, గృహ అవసరాల కోసం లక్షలాది కుటుంబాలు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్ కు అనుసంధానం చేసుకుని, విక్రయించుకునే వీలు కలుగుతుందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కనీస మద్దతు ధరను భారీగా పెంచామని, యూరియా వంటి ఎరువుల ధరలు పెరిగినా కూడా సబ్సిడీ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 450 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు అనుమతి ఇచ్చామని, అలాగే 40 వేల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారని.. ఇందులో 20,000 యూనిట్లు మొదటి విడతలో ఇన్‌స్టాల్ చేస్తామని వివరించారు. రామగుండం ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను దశలవారీగా నిర్మిస్తు న్నామని తెలిపారు. మొదటి విడతలో రూ.12,000 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ప్రారంభించారని, రెండో విడతలో 3800 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొనసాగు తున్నాయని చెప్పారు.

# క్యాబినేట్ హోదాతో సలహాదారులు

**(మొదటి పేజీ తరువాయి)** ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీ కృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# అమెరికా-భారత్ మధ్య రక్షణ ఒప్పందం

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# భౌతికంగా హాజరుకావాల్సిందే

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే.ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ–ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది.

# ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

**(మొదటి పేజీ తరువాయి)** ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. గతంలో పీజేఆర్ మరణించినప్పుడు బీఆర్ఎస్ దుర్మార్గంగా వారి అభ్యర్థిని నిలబెట్టిందని మండిపడ్డారు. నగరానికి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత పీజేఆర్‌దేనని కొనియాడారు. అలాంటి పీజేఆర్‌పై పోటీకి దింపిన బీఆర్ఎస్‌కు సానుభూతి ఓట్లు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కూడా సెంటిమెంట్‌ను నమ్ముకున్నారని ఆరోపించారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా అని నిలదీశారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నాయకులు వస్తే వారికి వాతలు పెట్టాలని ఓటర్లకు సూచించారు. నవీన్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు.

# హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను రోడ్డుపాలు చేస్తున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ క్రమంలో కేటీఆర్ షేక్‌పేట డివిజన్‌లో ప్రచారం చేశారు. ఓయూ కాలనీ మీదుగా వినోభానగర్ వరకు రోడ్డు షో కొనసాగింది.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, హిట్లర్ నశించడాన్ని చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నాళ్లు ఉంటుందో చూస్తామని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, ఒకవేళ ఓటమి ఎదురైతే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు నిలబడదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చడమా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఇందిరమ్మ పేదరికాన్ని నిర్మూలించాలని నినదిస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు.మాగంటి సునీత మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఒక కుటుంబమని గోపీనాథ్ చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మహిళలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించేవారని అన్నారు. కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఎవరికీ భయపడవద్దని, ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు

# ఇందిర, పటేల్లకు సిఎం రేవంత్ నివాళి

హన్మకొండ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు ఘనంగా నివాళి అర్పించారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లో ఆ మహనీయుల చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు ఇందిరాగాంధీ

**మహిళా శక్తికి ప్రతీక**
**సంక్షోభాలను సవాళ్లను ఎదుర్కొని గెలిచిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**ఇందిరాగాంధీకి ఘన నివాళి**




**చర్చ :-** డిసిసి కార్యాలయంలో జరిగిన వర్ధంతి వేడుకలకు హాజరు..స్వాతంత్ర్య పోరాటయోధురాలు, దేశ మహిళా శక్తికి ప్రతీక నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ ఇందిరా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఆ మహనీయురాలు చిత్రపటానికి వెలిచాల రాజేందర్ రావు కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ పేదల పక్షపాతి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ఇందిరా గాంధీ అని పేర్కొన్నారు. సంక్షోభాలను సవాళ్లను ఎదుర్కొని గెలిచిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వారి దివ్య స్మృతికి నివాళులు అర్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ష మల్లేశం, అనంతుల రమేష్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పాల్వంచలో రన్ ఫర్ యునిటీ






**చర్చ, పాల్వంచ:** జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయ ంతి పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు పాల్వంచ పోలీస్ వారి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు 2కె రన్ నిర్వహి ంచారు. సుమా రు 500 మంది యువతీ యువ కులు రన్‌లో పాల్గొనగా, ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్ఐ సుమన్, జీవన్ రాజ్ మరియు కళా ణి, ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్, పోలీస్ సిబ్బంది, పలువురు ప్రముఖులు, పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించండి: ఎమ్మెల్యే జారె



**చర్చ, అశ్వారావుపేట:** దమ్మపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి రైతు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం తగిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా తమ పంటను సమీప కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా రైతులకు తగిన సదుపాయాలు కల్పించబడతాయన్నారు. ధాన్యం తూకం చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయని పేర్కొన్నారు. దళారుల చేతిలో మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మార్కెట్ కమిటీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మా ప్యానల్ దే భారీ విజయం

**- చారిత్రాత్మక తీర్పుతోచరిత్ర సృష్టించబోతున్నాం అర్బన్ బ్యాంకును రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తయారు చేస్తాం**
**- మా ప్యానల్ అభ్యర్థులను ఆశీర్వదించండి**
**- నీతిమంతంగా నిజాయితీగా సేవలందిస్తారు మంత్రుల ఆశీస్సులతో మీ ముందుకు వచ్చాము**
**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**- మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్లో అర్బన్ బ్యాంక్ ప్యానల్ గెలుపు కోసం ప్రచారం**





**చర్చ :- కరీంనగర్**
అన్ని వర్గాల ప్రజలు.. అన్ని సంఘాలు, ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు ప్రతి ఒక్క అర్బన్ బ్యాంకు మెంబర్ సహకారము.. మద్దతుతో భారీ మెజార్టీతో మా ప్యానల్ విజయం సాధిస్తుందనీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అర్బన్ బ్యాంకును ఒక రోల్ మోడల్ గా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు తీసుకొని అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకున్నామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కరీంనగర్ కాశ్మీర్ గడ్డలోని మహిళా డిగ్రీ కాలేజ్ గ్రౌండ్లో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థుల గెలుపు కోసం రాజేందర్ రావు ప్రచారం నిర్వహించారు. వాకర్సు, మహిళలు, ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులు, ముస్లిం మైనార్టీలు, పలు సంఘాల ప్రతినిధులను కలిసి తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అస్తవ్యస్తంగా మారిన అర్బన్ బ్యాంకును ఆధునీకరిస్తామని ప్రక్షాళన చేస్తామని ఒక ఛాన్స్ ఇచ్చి చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర రావు మాట్లాడుతూ కరీంనగర్లో మార్పు కోసం అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పుతో చరిత్ర సృష్టించబోతున్నామని అర్బన్ బ్యాంకు మెంబర్స్ సహకారంతో భారీ మెజార్టీతో మా ప్యానల్ విజయం సాధించబోతున్నామని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు భవిష్యత్తు తమ ప్యానెల్ గెలుపు పైన ఆధారపడి ఉందన్నారు. మార్పు కోసం వివాదాల నుంచి విశ్వాసం పైపు నడిపించేందుకు తమ ప్యానెల్ అర్బన్ బ్యాంక్ మెంబర్లు గెలిపించేందుకు మెంబర్స్ డిసైడ్ అయిపోయారని పేర్కొన్నారు.గతంలో పనిచేసిన పాలకవర్గ పలు అనేక వివాదాలతో బ్యాంకును అస్తవ్యస్తంగా తయారు చేశారని బ్యాంకులో రాజకీయ జోక్యం పెచ్చుమీరిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాతాదారులు ఇన్వెస్టర్లు సభ్యుల రక్షణ.. విశ్వాసానికి కేరాఫ్ అడ్రస్ గా నిలవాల్సిన బ్యాంకు రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారిందన్నారు. మా పాలకవర్గం గెలిచిన అనంతరం బ్యాంక్ ప్రక్షాళనకు నడుంబిగిస్తామని ఆధునీకరిస్తా మని డిజిటలైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఖాతాదారులు విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెడతామని వారికి రక్షణ ఉంటామని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంక్ మెంబర్లు మార్పును కోరుకుంటు న్నారని ఆ మార్పు మా ప్యానల్ తోని సాధ్యమవుతుందని నమ్ముతున్నారని మంచి మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని రాజేందర్రావు తెలిపారు. గత పాలకవర్గాల్లో పని చేసిన వారు మళ్లీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని వారు ఎన్నికలను నిలిపివేసి తగాదాలు పెట్టుకొని ఆరోపణలు చేసుకొని మళ్లీ మభ్యపెడుతున్నారని అన్నారు. వారికి ప్రజల నుంచి అర్బన్ బ్యాంక్ మెంబర్ల నుంచి ఎలాంటి మద్దతు లేదన్నారు. తమ ప్యానల్ అభ్యర్థులను అందరూ ఆశీర్వదించాలని రాజేందర్రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి కాంగ్రెస్ నాయకులు అనంతుల రమేష్ ముస్లింమైనార్టీనాయకులుతదితరులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ ఐక్యత సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**చర్చ :- పెద్దపల్లి** సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం:పోలీస్ కమిషనర్జాతీయ ఐక్యత దినోత్సవం "రన్ ఫర్ యూనిటీలో" భాగంగా దేశ ఐక్యత సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అలాగే ప్రజలందరూ ఐక్యతగా, బంధు భావన కలిగి ఉండాలని, ప్రజల్లో జాతీయ ఐక్యత, సామరస్యం, దేశభక్తి, సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. భారత ఐక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయి పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవ పరుగు రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ముందుగా జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరుగు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. రామగుండంపోలీస్ కమీషనరేట్ నుండి రామగుండం మున్సిపల్ %% జంక్షన్ వరకు తిరిగి రామగుండంపోలీస్ కమీషనరేట్ గ్రౌండ్ వరకు పరుగు కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ సేవలు, దేశాన్ని ఏక్త బంధంతో కట్టిపడేసిన ఆయన నాయకత్వం ప్రతి ఒక్కరికీ ప్రేరణ అని మనమందరం ఐక్యతతో, స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి మరింత సాధిస్తుందని అన్నారు.రజాకార్లను విచిన్నం చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఏకం చేసిన స్వేచ్ఛ వాయువులు పీల్చుకునేల కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కు రుణపడి ఉండాలని సినీ నటులు సాగర్ అన్నారు. పటేల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని, అందుకు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని సిపి అంబర్ కిషోర్ ఝా తెలిపారు. యువత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తి, సమైక్యతా భావం ప్రతి ఒక్కరికి చేరేలా తమ వంతు సహకారం అందించాలి అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, ఆర్ ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, శేఖర్, మల్లేశం, సంపత్, సినీ నటుడు సాగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**- తడిసిన ధాన్యం ఏ స్థితిలో ఉన్న వెంటనే కొనుగోలు చేయాలి**
**- ఈ తుపాన్ ఊహించలేనిది, రైతులకు జరిగిన నష్టం మాటల్లో చెప్పలేనిది**
**- ధాన్యం తడిసిపోవడం, పంటలు నేలరాలిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం చూసి రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.**
**- రైతులను ఆదుకోవాలని కోరుతూ నేడు జిల్లావ్యాప్తంగా అన్ని మండల తహసిల్దార్లకు వినతి పత్రాల సమర్పణ.**
**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



**చర్చ :- కరీంనగర్** అకాల వర్షానికి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని, తడిసిన ధాన్యం ఏ కండిషన్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాడి మాట్లాడుతూ మెంథా తుపాను రైతులకు కన్నీరు మిగిల్చిందని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చేతికి వచ్చిన పంట పూర్తిగా దెబ్బతిందని, అనేక ప్రాంతాల్లో పంట పొలాలు నీటిలో మునిగిపోయాయని, వడ్ల కుప్పలు వరద తాకిడికి కొట్టుకపోయి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఉందన్నారు. ధాన్యం తడిసిపోవడం, పంటలు నేలరాలిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం చూసి రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. ఆరుగాలం శ్రమించి కోతకు సిద్ధమైన పంట నీటిపాలైందని, రైతుల కష్టం వృథా అయి, వారికి కన్నీళ్లను మిగిల్చిందన్నారు. యూరియా, విత్తనాలు దొరకక, రైతు భరోసా ఆలస్యమై, ఇప్పటికే రైతులు ఇబ్బంది పడ్డారని , మళ్లీ ఈ తుఫాను దెబ్బతో రైతుల బాధ వర్ణాతీతంగా మారిందని , వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల కు పంటను తీసుకువచ్చిన అటువైపుగా అధికారులు రాలేని పరిస్థితులు , పంట కొనుగోలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంట కొనుగోలుపై చేస్తున్న అలసత్వం నిర్లక్ష్యం కారణంగా నేడు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవహరించిన తీరు మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ధ్వజమెత్తారు.. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి తక్షణం చర్యలు చేపట్టాలని, అలాగే తాలూ , తరుగు తేమ పేరిట రైతాంగాన్ని వేధించకుండా , ఇబ్బంది పెట్టకుండా పంట ఏ స్థితిలో ఉన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ ఒకటో తేదీ శనివారం రోజున జిల్లావ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో ఎమ్మార్వోలకు వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో సభ్యులు తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోండి

**సహకార రంగంలో కరీంనగర్ జిల్లా చరిత్ర సృష్టించింది**
**ప్రభుత్వం నూతన పాలకవర్గం ద్వారా బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తుంది**
**ఎనిమిది సంవత్సరాలుగా పాలకవర్గం లేకపోవడానికి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణం**
**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**చర్చ :- కరీంనగర్**
సహకార రంగంలో కరీంనగర్ జిల్లా కు ఒక చరిత్ర ఉందని సహకార అర్బన్ బ్యాంక్ ను కూడా ఆ దిశగా నడిపించడానికి ఒక మంచి పాలక వర్గాన్ని ఎన్నుకోవాలని దానికి ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 92 కోట్ల పైచిలుకు డిపాజిట్లతో దాదాపు 50 కోట్ల లోన్లతో నడుస్తున్న అర్బన్ బ్యాంకుకు గత ఎనిమిది సంవత్సరాలుగా పాలకవర్గం లేకపోవడానికి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికలు జరిపి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని అడ్డంకులన్నీ తొలగించి ఎన్నికలకు పోవడం జరిగిందని అన్నారు.ఎన్నికల్లో ఎక్కువ మంది అనుభవమున్న కాంగ్రెస్ నాయకులు పోటీ చేస్తున్నందున ప్యానల్ ప్రకటించలేదని సభ్యులు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.రాబోయే రోజుల్లో ఇంకా డిపాజిట్లు పెరిగేవిధంగా ఖాతా దారుల్లో విశ్వాసం నింపే విధంగా పనిచేసే పాలకవర్గాన్ని ఎన్నుకోవాలని అనుభవమున్న కాంగ్రెస్ నాయకులు పోటీలో ఉన్నారని గెలిచిన పాలకవర్గానికి ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.అర్బన్ బ్యాంక్ ఎంతోమంది ఖాతాదారులకు సేవలు అందించడమే కాకుండా లోన్ల ద్వారా మధ్యతరగతి కుటుంబాలను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందని ఇప్పుడున్న 9 వేల మంది సభ్యులు పది కిలోమీటర్ల పరిధిలో గుర్తింపు కార్డు సమర్పించిన వారేనని వారందరూ ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని నరేందర్ రెడ్డి కోరారు.ఈ విలేఖరుల సమావేశంలో చర్ల పద్మ,దండి రవీందర్,బొబ్బిలి విక్టర్,ఎండి చంద్,షబానా మహమ్మద్, జ్యోతిరెడ్డి,హసీనా,అస్థాపురం రమేష్,శిల్ప ల పాల్గొన్నారు

# రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం అద్భుత విజయం: ప్రజల్లో జాతీయ ఐక్యతా స్ఫూర్తి








**చర్చ :- కరీంనగర్** ముఖ్య అధిదులుగా కేంద్ర ప్రభుత్వము ప్రధానం చేసే కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత మరియు రాష్ట్ర ప్రభుత్వం అందించే కాళోజి అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ గారు , దాశరధి అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్ పాల్గొన్నారు. భారత దేశ ఉక్కు మనిషి, స్వతంత్ర భారత తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, 'రాష్ట్రీయ ఏక్తా దివస్' (జాతీయ ఐక్యతా దినోత్సవం) సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్ల 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం విజయవంతమైంది. జాతీయ ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ పరుగులో విద్యార్థులు, యువత, క్రీడాకారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యంత ఉత్సాహంగా పాల్గొని జాతీయ సమైక్యత పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సీపీ శ్రీ గౌష్ ఆలం మాట్లాడుతూ , భారతదేశాన్ని సంఘటితం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని సీపీ కొనియాడారు. "యూనిటీ ఇన్ డైవర్సిటీ" (భిన్నత్వంలో ఏకత్వం) మన దేశ గొప్పతనమని, ఇది మన సంస్కృతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. 'రన్ ఫర్ యూనిటీ' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో జాతీయ ఐక్యత పట్ల చైతన్యం పెరుగుతుందని సీపీ పేర్కొన్నారు. మాతృదేశ సేవలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించి, యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించినప్పుడే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా కరీంనగర్ నగరంలో జాతీయ ఐక్యతా స్ఫూర్తి, దేశభక్తి వెల్లివిరిశాయని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీం రావు మరియు కమీషనరేటులోని అన్ని విభాగాల పోలీసు అధికారులు , వివిధ కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారి పదవీ విరమణ సన్మానం



**చర్చ :- కరీంనగర్** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఏఎస్సైగా సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించి శుక్రవారంనాడు టాస్కోర్స్ విభాగం నుండి పదవీ విరమణ పొందిన ఏఎస్సై టి . శంకర్ సింగ్ ని కరీంనగర్ పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఒక సాధారణ ప్రక్రియ అని, అయితే అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. పోలీసు అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని ఆయన గుర్తు చేశారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అనంతరం, పోలీస్ కమీషనర్ స్వయంగా పదవీ విరమణ పొందిన ఏఎస్సై శంకర్ సింగ్ కి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు భీం రావు రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్ (సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**













**హైదరాబాద్ చర్చ ప్రతినిధి** ఏడాది పొడవునా సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 150వ జయంతి వేడుకలను కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ, అలాగే అనేక స్వచ్ఛంద సంస్థలు ఘనంగా నిర్వహించబోతున్నాయి. కేంద్రం నుంచి రాష్ట్రం వరకు, పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు, రైతు నుంచి స్వాతంత్ర్య సమరయోధుడి వరకు ఎ ప్రతి భారతీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగస్వామిగా ఉండబోతున్నాడు. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదుబీ గుజరాత్‌లో రైతు ఉద్యమ నాయకుడుగా కూడా ప్రజల మనసుల్లో నిలిచారు. కానీ కాంగ్రెస్ పార్టీకి సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి మహనీయులు, లేదా తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు గారు లాంటి నాయకులు నచ్చరు. వారికి నెహ్రూ కుటుంబం తప్ప ఇంకెవ్వరూ గుర్తు ఉండరు. సర్దార్ వల్లభాయ్ పటేల్, పీవీ నరసింహారావు, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి దేశభక్తులను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తక్కువ చేసి చూసింది. దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం పోరాడిన వీరులందరినీ చరిత్రలో నిలిచేలా చేయడం ఎ నవతరానికి వారి త్యాగాలను తెలియజేయడం ఎ భారత ప్రభుత్వం చేపట్టిన గొప్ప కర్తవ్యం. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారిని ఏ తెలంగాణ బిడ్డ కూడా ఎప్పటికీ మరిచిపోడు. సర్దార్ చొరవతోనే ఈ తెలంగాణ గడ్డపై భారత త్రివర్ణ పతాకం ఎగిరింది. లేకపోతే నిజాం పాకిస్థాన్ జెండాను ఎగరవేయడానికి సిద్ధంగా ఉన్నాడు. అలాంటి నిజాం అహంకారాన్ని అణిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు. ఆ కాలంలో నిజాం తెలంగాణ ఆడబిడ్డలను అవమానించాడు, బతుకమ్మను నగ్నంగా ఆడించాడు. ఆ దుర్మార్గుడిపై ఉక్కుపాదం మోపి తెలంగాణ గడ్డను విముక్తి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్. సూర్యచంద్రులు ఉన్నంత కాలం తెలంగాణలోని ప్రతి బిడ్డ ఆయన పేరును గౌరవంగా స్మరించుకుంటాడు. రజాకార్లు ఊర్లపై దాడులు చేస్తున్న సమయంలో, సర్దార్ భారత సైన్యాన్ని పంపించి నిజాం ప్రభుత్వాన్ని ఓడించి తెలంగాణకు స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ఆత్మీయత, ధైర్యం, దేశభక్తి ఎ ఇవన్నీ మనకు మార్గదర్శకం. ఆయనకు గౌరవార్థం మోదీ గారు, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది. అందరం కలసి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 150వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకుందాం. ఆయన ఇచ్చిన ఐక్యత, స్వాతంత్ర్య విలువలను గుర్తుచేసుకుందాం. ప్రతి తెలంగాణ బిడ్డ ఆయన త్యాగాలను మరువకూడదు. ఈ సంవత్సరం మొత్తం ఆయనను స్మరించుకుంటూ, రజాకార్ల దమనకాండను గుర్తుచేసుకుంటూ, సర్దార్ పోరాటాన్ని ఘనంగా స్మరించుకుందాం.

# సింగరేణి జిఎం కనకయ్యకు ఘన సన్మానం



**చర్చ, కొత్తగూడెం సింగరేణి:** సింగరేణి సంస్థలో అంచలంచలుగా అనేక సేవలు అందించి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి) విభాగంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం పదవి విరమణ పొందిన మేకల కనకయ్యను ఆయన ఛాంబర్‌లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బహుజన ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్, రిటైర్డ్ సింగరేణి జిఎం శనగ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం సభ్యులు, సింగరేణి డీజీఎం చంద్రమౌళి, సుగుణారావు, నాతి దయానంద సాగర్, బంగారి శంకర్, దశరథ్ రజువాలు శాలువాతో కనకయ్యను ఘనంగా సత్కరించి తెలియజేశారు.

# శేష జీవితమంతా అంబేద్కర్ మార్గంలో నడవాలని ఆకాంక్షించారు



**చర్చ ,గోదావరిఖని(అక్టోబర్ 31).** తుఫాన్ ప్రభావంతో నేల కొరిగిన పంట పొలాలను పరిశీలించిన రామగుండం బిజెపి ఇంచార్జి కందుల సంధ్యారాణి. ప్రభుత్వం తరుపున రైతులను ఆదుకోవాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన సంధ్యారాణి. మొంథా తుఫాన్ ప్రభావంతో రామగుండం నియోజకవర్గ ప్రాంతంలోని పలు గ్రామాలలో నేలకొరిగిన పంటలను గురువారం రామగుండం బిజెపి ఇంచార్జి కందుల. సంధ్యారాణి పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ. పంట చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన రాష్ట్రంలో అమలు చేయకపోవడం వలన పంట నష్టం జరిగినప్పుడు రైతులకు భీమా అందడం లేదని అన్నారుఇప్పటికైనా రాష్ట్రంలో ఫసల్ భీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అంతర్గాం మండల అధ్యక్షులు బోడకుంటి సుభాష్ గారు మరియు వేల్పుకొండ సంపత్, గొల్లూరి పురుషోత్తం, ఆలకుంట మల్లేష్, తీగుట్ల నవీన్, ఉప్పుల నీలయ్య, తోట మహేష్, మల్లెత్తుల శంకర్, సంతపురి మహేష్, జెట్పేట్ తిరుపతి, పోరండ్ల నాగరాజు, శశి, మంత్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మా ప్యానల్ దే భారీ విజయం

**- చారిత్రాత్మక తీర్పుతోచరిత్ర సృష్టించబోతున్నాం**
**అర్బన్ బ్యాంకును రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తయారు చేస్తాం**
**- మా ప్యానల్ అభ్యర్థులను ఆశీర్వదించండి**
**- నీతిమంతంగా నిజాయితీగా సేవలందిస్తారు**
**మంత్రుల ఆశీస్సులతో మీ ముందుకు వచ్చాము**
**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**- మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్లో అర్బన్ బ్యాంక్ ప్యానల్ గెలుపు కోసం ప్రచారం**





**చర్చ :- కరీంనగర్**

అన్ని వర్గాల ప్రజలు.. అన్ని సంఘాలు, ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు ప్రతి ఒక్క అర్బన్ బ్యాంకు మెంబర్ సహకారము.. మద్దతుతో భారీ మెజార్టీతో మా ప్యానల్ విజయం సాధిస్తుందనీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అర్బన్ బ్యాంకును ఒక రోల్ మోడల్ గా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు తీసుకొని అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకున్నామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కరీంనగర్ కాశ్మీర్ గడ్డలోని మహిళా డిగ్రీ కాలేజ్ గ్రౌండ్లో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థుల గెలుపు కోసం రాజేందర్ రావు ప్రచారం నిర్వహించారు. వాకర్స్, మహిళలు, ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులు, ముస్లిం మైనార్టీలు, పలు సంఘాల ప్రతినిధులను కలిసి తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అస్తవ్యస్తంగా మారిన అర్బన్ బ్యాంకును ఆధునీకరిస్తామని ప్రక్షాళన చేస్తామని ఒక ఛాన్స్ ఇచ్చి చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర రావు మాట్లాడుతూ కరీంనగర్లో మార్పు కోసం అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పుతో చరిత్ర సృష్టించబోతున్నామని అర్బన్ బ్యాంకు మెంబర్స్ సహకారంతో భారీ మెజార్టీతో మా ప్యానల్ విజయం సాధించబోతున్నామని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు భవిష్యత్తు తమ ప్యానెల్ గెలుపు పైన ఆధారపడి ఉందన్నారు. మార్పు కోసం వివాదాల నుంచి విశ్వాసం పైపు నడిపించేందుకు తమ ప్యానెల్ అర్బన్ బ్యాంక్ మెంబర్లు గెలిపించేందుకు మెంబర్స్ డిసైడ్ అయిపోయారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన పాలకవర్గ పలు అనేక వివాదాలతో బ్యాంకును అస్తవ్యస్తంగా తయారు చేశారని బ్యాంకులో రాజకీయ జోక్యం పెచ్చుమీరిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాతాదారులు ఇన్వెస్టర్లు సభ్యుల రక్షణ.. విశ్వాసానికి కేరాఫ్ అడ్రస్ గా నిలవాల్సిన బ్యాంకు రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారిందన్నారు. మా పాలకవర్గం గెలిచిన అనంతరం బ్యాంక్ ప్రక్షాళనకు నడుంబిగిస్తామని ఆధునీకరిస్తా మని డిజిటలైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఖాతాదారులు విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెడతామని వారికి రక్షణ ఉంటామని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంక్ మెంబర్లు మార్పును కోరుకుంటు న్నారని ఆ మార్పు మా ప్యానల్ తోని సాధ్యమవుతుందని నమ్ముతున్నారని మంచి మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని రాజేంద్రరావు తెలిపారు. గత పాలకవర్గాల్లో పని చేసిన వారు మళ్లీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని వారు ఎన్నికలను నిలిపివేసి తగాదాలు పెట్టుకొని ఆరోపణలు చేసుకొని మళ్లీ మభ్యపెడుతున్నారని అన్నారు. వారికి ప్రజల నుంచి అర్బన్ బ్యాంక్ మెంబర్ల నుంచి ఎలాంటి మద్దతు లేదన్నారు. తమ ప్యానల్ అభ్యర్థులను అందరూ ఆశీర్వదించాలని రాజేంద్రరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిపల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి కాంగ్రెస్ నాయకులు అనంతుల రమేష్ ముస్లింమైనార్టీనాయకులుతదితరులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**చర్చ, సత్తుపల్లి:** పట్టణంలో మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ మొదటి మహిళా ప్రధానిగా 1966 నుండి 1977 వరకు వరసగా మూడు పర్యాయాలు, 1980లో 4వసారి ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ పని చేశారని గుర్తుచేశారు. 1984 అక్టోబర్ 31న తన నివాసంలో ఇందిరాగాంధీ హత్యగావించబడ్డారని పేర్కొంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందిరా గాంధీ దేశానికి అత్యున్నత గుర్తింపు తెచ్చే విధంగా ఎంతో కృషి చేశారని, ఆమె దేశానికి అందించిన ఫలాలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉక్కుమనిషి మార్గంలో యువత సాగాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**- దేశ సమగ్రతకు సర్దార్ పటేల్ కృషి నేటి తరానికి ఆదర్శం: ఎస్పీ రోహిత్ రాజు**













**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఐక్యతా దినోత్సవంలో భాగంగా శుక్రవారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ రన్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. సుమారు 500 మంది విద్యార్థులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలతో మారుమోగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ తీసుకున్న నిర్ణయాలు స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఆయన పుట్టిన రోజున నిర్వహించే ఐక్యతా దినోత్సవం కార్యక్రమాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడటంలో సర్దార్ పటేల్ చేసిన కృషి ప్రతి భారతీయుడికి ఆదర్శం అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా భారతదేశంపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టడంలో మనందరం సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత తమ ఆలోచనలను దేశ అభ్యున్నతికి ఉపయోగపడేలా మలచుకోవాలని సూచించారు. అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. కలెక్టర్, ఎస్పీలు జెండా ఊపి రన్ ఫర్ యూనిటీకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్, 6వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, డీఎస్పీలు రెహమాన్, మల్లయ్యస్వామి, అలాగే సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలపడేందుకు చేపలపెంపకం దోహదం

**- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**
**- సింగభూపాలెం చెరువులో 74,100 చేపపిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే**



**చర్చ, సుజాతనగర్:** గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థ బలపడేందుకు చేపల పెంపకం దోహదపడుతుందని, సొసైటీలుగా ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లోని చేపల చెరువులను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ముందుకు రావాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సుజాతనగర్ మండలం, సింగభూపాలెం చెరువులో మత్స్యశాఖ మంజూరు చేసిన 74,100 చేపపిల్లలను శుక్రవారం అయన చెరువులో విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు జీవనాధారంగా నిలుస్తాయని, చేపల పెంపకం ద్వారా రైతులు, మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. ప్రతి చెరువు సజీవంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు తమవంతు భాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. చేపలపెంపకం ద్వారా ఆర్థికాతోడ్పాటు మాత్రమే కాకుండా వాతావరణ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్థానిక మత్స్యకార సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. చెరువుల సంరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని విస్తరించాలని, ప్రభుత్వం, అధికారులు చేపల ఆహారం, విత్తనాల సరఫరాపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రజా భాగస్వామ్యంతో చెరువులను అభివృద్ధి చేసి స్థిరమైన ప్రగతి సాదించేందుకు శాక్తివంచన లేకుండా కృషిచేస్తానని స్పష్టం చేశారు. మత్యశాఖ జిల్లా అధికారి అహ్మద్ ఇంతియాజ్ ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడివో భారతి, వ్యవసాయశాఖ అధికారిని నర్మదా, వివిధశాఖల అధికారులు కిషన్, బి శ్రీనివాస్, రాయల నాగేశ్వర్రరవు, రమాదేవి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, మండె హన్మంతరావు, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, మధ్యసొసైటీ నాయకులు బానోత్ సూర్య, పిట్టల శైలు, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులను తరిమికొట్టాలి

**- శ్రామిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం**
**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి, ఉప్పుశెట్టి**
**- ఘనంగా ఏఐటియుసి 106వ ఆవిర్భావ వేడుకలు**









**చర్చ, పాల్వంచ:** దేశం నుంచి కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులను తరిమికొడితేనే కార్మికవర్గానికి, ప్రభుత్వరంగ సంస్థలకు మనుగడ ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ పునరుద్ఘాటించారు. ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాల్వంచ పట్టణంలోని భవన నిర్మాణ, మున్సిపల్, పెయింటర్స్, హమాలీ, ఫుట్ పాత్ కార్మికుల అడ్డాలు, అమరవీరుల స్మారక స్థూపాలు, సీపీఐ కార్యాలయంలో ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆవిర్భావ సదస్సులో వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా మార్పులు చేస్తూ శ్రామిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడులుగా చేసి కార్మిక హక్కులను హరిస్తోందని విమర్శించారు. సుదీర్ఘకాలంగా ప్రభుత్వరంగంలో నడుస్తున్న రైల్వే, బిఎస్ఎన్ఎల్, భీమా, విమానయాన తదితర రంగాలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి లక్షలాది మంది కార్మికులను, ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చి రోడ్డుపాలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన మోడీ ప్రభుత్వం ఆదాని, అంబాని లాంటి కుబేరులను మరింత కుబేరులుగా మార్చడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. కేంద్రంలో పన్ను విధానం వల్ల అనేక కంపెనీలు మూతపడి లక్షలాది కార్మికులు వీధినపడ్డారని, దినసరి కూలీలు, చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వ చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, మూలవేతనంతోపాటు కరువు భత్యం చెల్లించాలని, సమాన పనికి సమానవేతనం, కాంట్రాక్టీకరణ రద్దు, కార్మికుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటిత రంగానికి సమగ్ర సంక్షేమ పోరాడి సాధించుకోవాల్సిన భాధ్యత అందుకోసం ఉద్యమాలవైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ నిరంకుశ పాలనలో కార్మికులు ఒకచోట గుమిగూడటానికి సైతం నిషేదం ఉన్న పరిస్థితిలో ఏఐటియుసి పోరాడి ట్రేడ్ యూనియన్ చట్టం 1926ను తొలి హక్కుగా సాధించిందని, నేడు కార్మికుడు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక ఏఐటియుసి త్యాగం, పోరాటం దాగి ఉందన్నారు. 106ఏండ్లుగా కార్మికులకు ఏఐటియుసి జెండా అండగా ఉందని, కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఏఐటియుసి అండగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డి. సుధాకర్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నరహరి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు వి. పద్మజ, నాయకులు డి. చెన్నయ్య, గిరి, బిక్కులాల్, కోరే కృష్ణ, శెట్టి చేరాలు, జి. రవి, వెంకన్న, కృష్ణ, అల్లి వెంకటేశ్వర్లు, సర్వయ్య, బిల్లా రంగయ్య, రాము, వెంకట్, బాబు, మహేష్, వెంకన్న, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన






**చర్చ, పాల్వంచ:** స్థానిక బొల్లోరిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి అధ్యక్షతనన జరిగిన సదస్సుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రామ్, అసిస్టెంట్ మేనేజరు శ్వేతా ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల విద్యార్థులకు కెరీర్ బిల్డప్ చేసుకొనుటకు మెలకువలను తెలియజేశారు. చదువును సార్థకం చేసుకుని కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లడం కోసం ఏ విధమైనటువంటి ప్లానింగ్ ఏర్పరచుకోవాలో వివరించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత ఏయే చదువులు చదవాలి, ఏయే ఉద్యోగావకాశాలు ఉంటాయనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక స్థాయి నుండే లక్ష్యం ఏర్పరచుకోవాలని, తదనుగునంగా కెరీర్‌ను మలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్, బి.చెన్నారావు, కే. సురేష్, బి. కిషన్, డి.అర్జున్ రావు, ఎం. గంగ, బి.లలిత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే: సీఐ మురళి



**ఖమ్మం:** రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని ఖమ్మం రూరల్ సీఐ మురళి అన్నారు. ఖమ్మం రూరల్ పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, యువత, ప్రజలు పాల్గొన్నారు.ద

# నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

**- ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మరియు నాయకులు**



**చర్చ :- కరీంనగర్** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా చౌక్ వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో దేశంలో ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండాలని ఆనాడే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ పథకం కొనసాగుతుందని అన్నారు. దేశ సమైక్యత కోసం పాటు పడిన ఇందిరాగాంధీ కొన్ని దుష్ట శక్తులకు బలి కావలసి వచ్చిందని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్దులమై పని చేయాలని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, చర్ల పద్మ, ఎండి చాంద్, బొబ్బిలి విక్టర్, దండి రవీందర్, అహ్మద్ అలీ, అష్రాఫ్, వంగల విద్యా సాగర్, చింతల కిషన్, రాజిరెడ్డి, షబానా మహమ్మద్, జ్యోతిరెడ్డి, బషీర్, భారీ, హసీనా, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికులు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటర్ వెహికల్ వ్యవస్థాపకుడు కె.ఎన్. రాజశేఖర్, మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షరాలు చిన్నారి నైనిక రజువాతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం గణేష్ ఆలయ ప్రాంగణంలో నూరువరాల మొక్కను నాటారు. ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వా ములవ్వాలి. ఒక్కొక్కరు ఒక మొక్క నాటితేనే ప్రకృతి కాపాడబడుతుంది" అని తెలిపారు.

## పదవీ విరమణ ఉద్యోగులకు ఘన సన్మానం




**చర్చ, సత్తుపల్లి:** సత్తుపల్లి సింగరేణి జే.వి.ఆర్ ఓసీలో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన వారికి శుక్రవారం ఐఎన్‌టియుసి ఫిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన ఆహమ్మద్ పాషా, భాస్కరరావు లను బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహమ్మద్ పాషా , భాస్కర రావులు సింగరేణిలో 37 సంవత్సరాలు రక్షణ, క్రమశిక్షణతో విధులు నిర్వహించారన్నారు. సంస్థలో ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, యాజమాన్యం అప్పగించిన పనులను తమ శక్తి మేరకు నిజాయితీ, నిబద్దతతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.ఆర్ ఓసి మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ కాజా మొయినుద్దీన్, ఓల్డ్ సిహెచ్‌పి ఇన్చార్జ్ చంద్రమౌళి, అసిస్టెంట్ ఫీట్ సెక్రెటరీలు కోటేశ్వరరావు, సురేష్, ఐ.వి, రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేందర్, నాయకులు మురళి, రఫీ, రాము, చంద్రశేఖర్, రత్నాకర్, నరేందర్, కాజా, మంగీలాల్, నరేష్, కిషన్ రావు, రాంబాబు, రవిశంకర్, గాలి వెంకటేశ్వర్లు, గోపి, శ్రీధర్, రమేష్, బాలకృష్ణ, లక్ష్మణ్, రాములు నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి మంచినీటి సరఫరా ప్రతిరోజు అందించాలనీ, కోతులు, కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించాలనీ, వర్షాల కారణంగా దెబ్బతిన్న అంతర్గత సిసి రోడ్లను తక్షణమే మరమ్మతు చేయాలని, బస్తీల్లో దోమల మందు, బ్లీచింగ్ పొడి చల్లే కార్యక్రమాన్ని పునరుద్ధరించాలనీ డిమాండ్ చేశారు.ధర్నాలో సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాల్ రాజ్, సిఐటియు నాయకులు భూక్యా రమేష్, మహిళా నాయకురాలు ,పాల్గొన్నారు.

# ఏజీఎంగా పదోన్నతి పొందిన పీవోకు సన్మానం



చర్చ, సత్తుపల్లి:ఎడిషనల్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన సింగరేణి కిష్టారం ఓసి ప్రాజెక్టు మేనేజర్ నరసింహారావును ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ ఘనంగా సత్కరించారు. సింగరేణి సంస్థ ప్రగతికి వెన్నెముకగా నిలిచే కార్మిక వర్గానికి మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తూ, నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల సాధనలో స్ఫూర్తి దాయకమైన విజయాలతో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని కొనియాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి పై అధికారులతో సంప్రదించి ఎప్పటికప్పుడు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ నాయకులు, పిట్ సెక్రటరీలు నాగ ప్రకాష్, రామారావు, నాగేశ్వరరావు, జే.వి.ఆర్ ఓసి మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ ఖాజా మొయినుద్దీన్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్, అఫ్రోజ్, నాయకులు రషీద్, పొట్టి కిరణ్, రాజు, శ్రీధర్, రాజ్ కుమార్, శుక్రు, రాంబాబు, శ్రీనివాస్, రాజేష్, రమేష్, అశోక్, హమీద్, బాజీ పాషా, నాయకులు,పాల్గొన్నారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి



**- ఎస్పీ రోహిత్ రాజు**

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. గత 36 సంవత్సరాలపాటు పోలీస్ శాఖలో సేవలందించిన వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం అని ఎస్పీ అన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షులు ఏసోబు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే కొత్త మెనూ అమలు చేయలేరు

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు**
**- ఏవోకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేత**




చర్చ, సత్తుపల్లి:మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే కొత్త మెనూ అమలు చేయలేరని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోటరామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని సుమారు 1,140 ఏజెన్సీలలో 2,090 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు పనిచేస్తున్నారని, వీరికి గత పది నెలలుగా కోడిగుడ్ల బిల్లులను చెల్లించలేదన్నారు. 9, 10వ తరగతుల మెనుచార్జీలు చెల్లించలేదని, గౌరవ వేతనం 6 నెలలుగా పెండింగ్ ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన అల్పాహారం బిల్లులు సైతం రెండు సంవత్సరాలైనా చెల్లించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి రావాల్సిన పెండింగ్ బిల్లులు, మెను చార్జీలను తక్షణమే చెల్లించాలని, లేనియడల నవంబర్ 12వ తారీఖున రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెపంగు మల్లేష్ మాట్లాడుతూ రూ.6.19 లకు రెండు కూరలు ఎలా వండి వడ్డిస్తారని ప్రభుత్వం కనీసం ఆలోచన చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకి ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షురాలు మహాదేవ లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహమునిసా, జిల్లా ఉపాధ్యక్షురాలు మండల కృష్ణకుమారి, ఏఐటియుసి ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు తెలగారపు రామారావు, కుంటా వెంకమ్మ, జక్కంపూడి వెంకటలక్ష్మి. ఇజ్జగాని వెంకటమ్మ, బండి నరసమ్మ, పూచి సీత, సిహెచ్ సత్యవతి, రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, జరీనా, కృష్ణకుమారి, లక్ష్మీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# సహజ ఉత్పత్తులను ప్రోత్సహించండి బిబిప్రకృతి కవి జయరాజుబు





చర్చ,భద్రాద్రి కొత్తగూడెం సహజసిద్ధమైన, రోగాలురాని, సువాసనలతో కూడిన ఉత్పత్తులను నిత్యజీవితంలో, కుటుంబ సమేతంగా వాడుకోవాలని సహజ ప్రకృతి కవి, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు, కాలోజీ అవార్డు గ్రహీత డాక్టర్. జయరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సమీపంలో గల "ఉదయం నేచర్ క్యూర్ సెంటర్లో" కుంకుడు కాయల రసంతో తయారుచేసిన ఐదు రకాల ప్రొడక్ట్స్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో, అంతర్జాతీయంగా పేరుగాంచిన లోకసాని పద్మా రెడ్డి అనే రైతు ప్రకృతి సహజసిద్ధంగా కుంకుడుగాయలతో అనేక రకాల ప్రొడక్ట్స్ ని తయారు చేస్తున్నారని తెలిపారు. నిజ జీవితంలో మన వాడుకునే అన్ని రకాల ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయని వెల్లడించారు. దీని ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ లాంటి మహమ్మారిని సైతం ఓడించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి ప్రేమికులందరూ ఈ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా, నిరంతరం సమాజ సేవలో, ప్రకృతి సేవలో తరిస్తున్న ప్రకృతిక కవి జయరాజు బి మంగతాయి దంపతులను ఆశ్రమం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి ఆశ్రమం సభ్యులు స్థానిక ప్రకృతి వైద్యులు సుగుణారావు, రిటైర్డ్ సింగరేణి జిఎం శనగ వెంకటేశ్వర్లు, మనకీ బాత్ మొక్కల రాజశేఖర్, కరాటేలో గిన్నిస్ హోల్డర్ మాటూరు మహావిష్ణుమూర్తి, దయా నందసాగర్, బంగారి శంకర్, శోభారాణి, దశరథ్ రజువా లు పాల్గొనగా చిన్నారి ప్రకృతి హరిత దీక్షరాలు నైనిక రజువా జయ రాజు దంపతులకు మొక్కను అభినందనలు అందుకున్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి




చర్చ, సత్తుపల్లి:మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభత్వం ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారభించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ.ఐయు.కె.ఎ స్) సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి, కార్యదర్శి బీరెల్లి లాజర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల%వా%కమిటి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొంథా తుపాన్‌కి ముందు, తర్వాత భారీ వర్షాల కారణంగా మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న, తదితర రైతాంగం తమ పంటలు తీవ్రంగా నష్టపోయారని, కనీసం ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం అంచనాలు వేయకుండా చోద్యం చూస్తుందని అన్నారు. వర్షాలు ఎక్కువ రావడంతో వరి మునిగిపోయి మొలకలు రావడం జరుగుతుందని అన్నారు. పత్తి రైతులకు కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని, వరి పత్తి ఎకరానికి రూ. 20 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని, రంగు మారిన మొలకెత్తిన పంటలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరల ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా మండలంలో నష్టపోయిన పంటలను సమగ్ర సర్వే చేసి పంటలు నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రైవేట్ వ్యాపారస్తుల చేతులలో మోసాలుకు రైతాంగం గురికావాల్సిన పరిస్థితి నెలకొందని తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్సా వెంకటేష్ , బొజ్జ విశ్వనాథం, నడికుదురు భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ

**- కార్మికుల హక్కుల పరిరక్షణ ధ్యేయం**




చర్చ :- 31 అక్టోబర్ మణుగూరు పివి కాలనీ కేఎల్ మహేంద్ర భవన్ వద్ద 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై. రాంగోపాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఆనాడు కార్మిక వర్గం అంతా ఏకమై 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో లాలా లజపతిరాయ్, జోషి నాయకత్వంలో మొదటి ఏఐటీయూసీ మహాసభ జరిగిందని అన్నారు. దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కుల కొరకు ఆనాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి దేశ కార్మిక వర్గానికి పని గంటల విధానం, వేతన ఒప్పందం, రక్షణ, ఇన్సూరెన్స్, ప్రొఫ్, గ్రాడ్యుటి, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీం ఇలా అనేక హక్కులు పోరాడి సాధించుకున్న చరిత్ర ఏఐటియుసిది అని అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర గల ఏఐటీయూసీలో పనిచేయడం గర్వకారణం అని అన్నారు. సింగరేణిలో ఏఐటియుసి ఆధ్వర్యంలో అనేక హక్కులు కార్మిక వర్గం పోరాడి సాధించుకుందని అన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ సాధించి పెట్టిన బోనస్ చట్టం దేశవ్యాప్తంగా కార్మికులకు అందరికీ వర్తించిందని అన్నారు. లాభాలలో వాటా దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని హక్కును ఏఐటీయూసీ సాధించిందని ఎన్నో పోరాటాలు , ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న %బీణూ% ప్రభుత్వం రద్దు చేసి నాలుగు చట్టాలుగా చేయాలని చుస్తుందని దీని రద్దుకై కార్మిక వర్గం అంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ రక్షణకు కార్మికుల హక్కుల ద్యేయం అని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ రాంనర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆఫీస్ బేరర్ లు ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, సెంట్రల్ కౌన్సిల్ నెంబర్ దాట్ల సందీప్, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాష్ చారి, సీనియర్ కార్యకర్తలు మన్నెం యోహాన్, ఇమాముద్దీన్, ఆకులపల్లి చంద్రశేఖర్, కోటేశ్వరరావు, సురేష్, సాంబశివరావు, పాల్గొన్నరు

# ఎస్ఐఆర్ సన్నాహక ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రత్యేక ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్టరింగ్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు, బిఎల్ఓ సూపర్వైజర్లతో ఎస్.ఐ.ఆర్ పూర్వ సన్నాహక ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావు లేకుండా నిర్వహించాలని, నిర్దిష్ట రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్ఓలు బాధ్యతాయుతంగా పని చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో తప్పకుండా ఉండేలా నిశిత పరిశీలన జరపాలని సూచించారు. 2002 సంవత్సరపు ఓటరు జాబితాను 2025 సంవత్సరం జాబితాతో మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు గుర్తు చేశారు. ముందుగా మ్యాపింగ్ చేయబడిన కేటగిరి 'ఏ' జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా ధవీకరించి, అది ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం కేటగిరీ 'సి' మరియు కేటగిరీ 'డి' లోని ఓటర్లను 'ఏ' కేటగిరీకి మ్యాపింగ్ చేసే ప్రక్రియను ఎఇఆర్ఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రజా పాలన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన సాదా బైనామా మరియు అసైన్డ్ భూముల పెండింగ్ దరఖాస్తులను నవంబర్ 3వ తేదీ లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు పరిష్కరించిన దరఖాస్తులపై వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలనీ, తిరస్కరించిన దరఖాస్తులపై తగిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# విద్యార్థినీ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం






**చర్చ:- 31 అక్టోబర్ మణుగూరు**

ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ గారి ఆదేశానుసారం ఏజెన్సీ ప్రాంతంలోనీ విద్యార్థినీ విద్యార్థులకు భవిష్యత్తులోముందడుగు వేయడానికి కెరియర్ గైడెన్స్ అనే ఒక ప్రోగ్రాం ని తీసుకు రావడం జరిగింది దానిలోభాగంగా ప్రతి నెలలో 2వ శుక్రవారం , 4వ శుక్రవారం నిర్వహించాలనిఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ తీసుకురావడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు మణుగూరు పట్టణంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ గారైన నాగబాబు ని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న విషయాల గురించి ప్రస్తావిస్తూ ఆయన జీవితంలో ఉన్నత స్థాయికి ఎలా ఎదిగారు అనే దాని గురించి వివరించడం జరిగింది కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి పూర్తయిన తర్వాత ఏ ఏ కోర్సులు తీసుకొని ఎలా ముందుకు వెళితే ఉద్యోగాలు సంపాదించుకోవచ్చు ప్రస్తుత సమాజంలో ఏ కోర్సులు బాగా డిమాండ్ ఉన్నాయి వాటి గురించి అవగాహన కల్పిస్తూ జాబ్ సాధించడానికి మెలుకువలు చెబుతూ తన జీవితంలో జరిగిన విషయాలనుఉదాహరణలుగా చెబుతూ ఎలా ముందుకు వెళ్లాలని తెలియజేశాడు విద్యార్థులకు తల్లిదండ్రులు పడుతున్న బాధలు చూసి బాధ్యత నేర్చుకొని దాని నుంచి ఎలా ఎదగాలి ఏం అవ్వాలి అనుకునేది నిర్ణయించుకోవాలని సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలని బాలికలకు సమాజంలో జరుగుతున్న నేరాల మీద అవగాహన కలిగి ఉండాలని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని అదేవిధంగా మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో గిరిజన ఆశ్రమ పాఠశాల మణుగూరు పాఠశాల నుంచి బహుమతులు పొందిన విద్యార్థులకు సి.ఐ నాగబాబు చేతుల మీదగా మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ ను అందజేయడం జరిగింది, ఇలాంటి కార్యక్రమాలు పెట్టడం విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ ని ప్రశంసించారు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ పెట్టడం ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఉద్దీపకం అనే పుస్తకము తీసుకురావడం వల్ల అది వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని , ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను గిరిజనుల కోసం తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబు కు ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి , స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు రాణి, వీరభద్రం, మిగిలిన ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి ,రాజ్యలక్ష్మి సుగుణ, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారావు, మిగిలిన ఉపాధ్యాయులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# విశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ

**- బహుమతులు అందజేసిన బెటాలియన్ అధికారులు**





**చర్చ, సత్తుపల్లి:** డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర మరియు డ్రగ్స్ కు విద్యార్థులు దూరంగా ఉండటం ఎలా? అనే అంశంపై అమర పోలీస్ సంస్మరణ వారోత్సవంలో భాగంగా 15వ పోలీస్ బెటాలియన్ అధికారులు నిర్వహించిన వ్యాసరచన పోటీ లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో విశ్వశాంతి విద్యాలయానికి చెందిన లోహిత (8వ తరగతి) ప్రథమ స్థానం, నాగ వర్షిని( 9వ తరగతి) తృతీయ స్థానం, డి ఏవి కళాశాలకు చెందిన చరిష్మా( ఇంటర్ సెకండియర్) ద్వితీయ స్థానం సాధించారు. గురువారం గంగారం బెటాలియంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బెటాలియన్ అదనపు దళాధిపతి అంజయ్య , సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా, రంగారెడ్డి బహుమతులు. అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం అరికట్టడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# ఈనెల 8,9,10 న జాతీయ, రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీలు


**- నేషనల్ గేమ్స్, స్టేట్ మీట్ - ఆటల పోటీలు జరగనున్న సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు**



**చర్చ :- 31 అక్టోబర్ మణుగూరు**


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ప్రజా భవన్ %మీూ% క్యాంపు కార్యాలయం నందు నేషనల్ గేమ్స్ స్టేట్ మీట్ – ఆటల పోటీలు జరుగుతున్న సందర్భంగా సంబంధిత అధికారులతో ప్రెస్ మీట్ లో పాల్గొన్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ గవర్నమెంట్ వారి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి 17సంవత్సరాల లోపు బాలబాలికల పాఠశాలల కబడ్డీ పోటీలు పినపాక మండలంలో ఎడుళ్ళ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు కేటాయించడం జరిగింది. ఈ పోటీలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడావేదికలో నవంబర్ 8, 9,10 తేదీలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో జాతీయ, రాష్ట్ర బాల బాలికల జట్లు పాల్గొంటాయి. ప్రతి జట్టులో 12 మంది క్రీడాకారులు కోచ్ మేనేజర్లు ఉంటారు. ఈ పోటీల్లో సుమారుగా 300 మంది క్రీడాకారులు 100 మంది రెఫరీలు పాల్గొంటారు. ఈ పోటీలు ప్రో కబడ్డీ మ్యాట్ పై పగలు మరియు రాత్రి వేళల్లో ఫ్లెడ్లైట్ల వెలుతురులో జరుగుతాయి. ఈ పోటీలలో పాల్గొన నున్న క్రీడాకారులకు మరియు అధికారులకు భోజనం మరియు వసతి సౌకర్యాలను మరియు పోటీల నిర్వహణ ఖర్చు ను కంది చారిటబుల్ ట్రస్ట్ ఏడుళ్ల బయారం వారి ఆధ్వర్యంలో కల్పించబడతాయి. ఈ రాష్ట్రస్థాయి పోటీల నుండి తెలంగాణ బాల బాలికల జట్టును ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుంది. తెలంగాణ బాలుర జట్టు జనవరి 7 నుండి 11 వరకు జరిగే పినపాక మండలం లోని ఏడుళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. బాలికల తెలంగాణ జట్టు మహారాష్ట్రలోని అహల్య నగర్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఈ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఏజెన్సీ మరియు గిరిజన జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెంలోని మారుమూల మండలమైన పినపాక మండలంలో జాతీయస్థాయి 17 సంవత్సరాల లోపు బాలుర పోటీలను కేటాయించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ పోటీలలో భారతదేశంలోని అన్నీ రాష్ట్రాల క్రీడాకారులు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల క్రీడాకారులు కూడా పాల్గొంటారు సుమారుగా 650 మంది క్రీడాకారులు మన పినపాక మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడుళ్ల బయ్యారంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు విచ్చేయుచున్నారు. ఈ పోటీలను చరిత్రలో నిలిచిపోయేటట్లుగా చాలా అంగరంగ వైభవంగా జరిపించడానికి కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటులు చాలా చురుకుగా జరుగుతున్నాయి. ఇలాంటి పోటీలు మారుమూల ఏజెన్సీ మండలాల్లో జరగడం వల్ల గ్రామీణ స్థాయి క్రీడాకారులలో ఆసక్తి పెరిగి వారు కూడా క్రీడారంగంలో రాణించడానికి అవకాశం కలుగుతుంది అని ఈ కార్యక్రమంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ .పి. సంకీర్త్ , పీడీ వీరన్న , ఎం ఈ ఓ నాగయ్య , పినపాక మాజీ వైస్ ఎంపిపి కంది సుబ్బారెడ్డి , గంగిరెడ్డి వెంకట్ రెడ్డి , మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా అధ్యక్షులు కూరపాటి సౌజన్య , శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు , కాటిబోయిన నాగేశ్వరావు గారు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా గారు, లారీ యూనియన్ 14 టైర్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి గారు, 12 టైర్ అధ్యక్షులు దున్నపోతుల శ్రీను , మండల నాయకులు సుబ్బారెడ్డి, పాతూరి వెంకన్న , పాలమూరి రాజు , మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దక్షిణవీధి వారసుడు



నేను మీకు నా కథ చెప్పేముందు.. అమ్మ–నాన్నల, తాతయ్య–నానమ్మల ద్వారా నేను విన్న, నేను తెలుసుకున్న మా ఇంటి కథ, అందులో ఉన్న నా కథ చెప్తాను వినండి. అమ్మ, నాన్న నా ముందే అన్ని విషయాలూ మాట్లాడుకుంటారు. నేను కూడా.. 'ఆరోజు సంగతులు ఏమిటా?' అని ప్రతిరోజూ వినటానికి ఆసక్తిగా ఉంటాను. ప్రతిరోజూ అమ్మ, నాన్న, తాతయ్య, నానమ్మ మాట్లాడే విషయాలు వింటున్న నాకు.. వీళ్లందరి సమస్యకు కారణము నేనే అనిపించింది. నేను వచ్చిన తర్వాత మా ఇంట్లో చాలా మార్పులు జరిగాయి. ఉదయం అమ్మ దగ్గరికి నానమ్మ వచ్చి..“ఆ జాతి తక్కువ వాడిని అనాథ ఆశ్రమంలో చేర్చండి లేదా ఇంటి నుండి వెళ్ల గొట్టండి. వాడు మన వంశ వారసుడు కాదు అంటే వినరు. ఈ ఇంట్లో ఇప్పటివరకు జరిగిన దరిద్రాలు చాలు, వాడు వచ్చిన తర్వాత మనింట్లో జరిగిన అరిష్టాలు నువ్వు, నీ మొగుడు గుర్తుకు తెచ్చుకోండి” అంటూ గొనుగుతూ బాల్కనీలోకి వెళ్లిపోయింది. ఆ క్షణం అమ్మ కళ్లలో నీళ్లు చూసాను. అమ్మ, నాన్న ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. మా ఇంట్లో వారితోపాటు తాతయ్య, నానమ్మ ఉంటారు. మా అమ్మ నాన్నలకు పెళ్లయి పది సంవత్సరాలు అయింది. చాలాకాలం పిల్లలు కలగలేదు. నాలుగు సంవత్సరాల క్రితం మా ఇంట్లో దాలమ్మ అనే పనిమనిషి చేరింది. దక్షిణ వీధి నుండి వచ్చేది. మొదట్లో ఆవిడ పనిమనిషిగా రావటం తాతయ్య, నానమ్మకు ఇష్టం లేదు. పనివారు దొరక్క.. ముఖ్యంగా అమ్మ నాన్న ఉద్యోగాలకు వెళ్లిన తరువాత తాతయ్య, నానమ్మలకు రోజంతా తోడుగా ఉంటుందని తప్పనిసరై ఒప్పుకొన్నారు. దాలమ్మకు నెలల బిడ్డ. వాడి పేరు ఏసుదాసు. ఆవిడ భర్త తాగుబోతు. దాలమ్మ మా ఇంట్లో పని చేసేటప్పుడు ఆవిడ కొడుకును అమ్మ ఆడించేది. ఒక్కోసారి అమ్మ ఒడిలోనే నిద్రపోయేవాడు. పిల్లలు లేని అమ్మ వాడిని అడిపించటంలోనే మాతృత్వ అనుభూతి పొందేది. దాలమ్మ భర్త ప్రతిరోజూ తాగి వచ్చి దాలమ్మను హింసించడం, అనుమానించడం వంటి బాధలు పడలేక.. ఒకరోజు దాలమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మా ఇంట్లో ఆమె చివరి రోజూ పనిచేస్తూ.. “మీకు పిల్లలు లేరు కదా! నా కొడుకును పెంచుకోండి” అంది. ఆవిడ చనిపోయిన తరువాత దాలమ్మ కొడుకు ఏసుదాసును ఇంటికి తీసుకు వచ్చారు. ఏసుదాసు పేరును రామదాసుగా మార్చారు నాన్న. నానమ్మ, తాతయ్య.. దాలమ్మను తప్పనిసరై పని మనిషిగా ఒప్పుకున్నట్లే, ఆవిడ బిడ్డ దాసును పెంచుకోవటం ఇష్టం లేకపోయినప్పటికీ తప్పనిసరై ఒప్పుకొన్నారు. అందరూ ముద్దుగా 'దాసు' అని పిలుస్తున్నారు. దాసు వచ్చిన రోజు నుండి అమ్మనాన్నల ఆనందానికి అవధులు లేవు. వాడు వచ్చిన రెండవరోజు ఆకలితో ఏడుస్తుంటే అమ్మ, రొమ్ము పాలు పెట్టిందట. అప్పటి వరకూ పిల్లలు లేక జీవితంలో ఏదో కోల్పాయామని అనుకుంటున్న వారిద్దరు.. దాసును అల్లారు ముద్దుగా చూసేవారు. దాసు వచ్చిన కొద్దిరోజులకు నాన్న ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. అమ్మకూడా దూరంగా ఉన్న స్కూల్ నుండి దగ్గరి స్కూలుకు బదిలీ అయింది. ఇవన్నీ వాడివల్లే అని మురిసిపోయారు. కొడుకు, కోడలుకు పిల్లలు లేరని దిగులు పోయి హాయిగా నవ్వుకోవటంతో.. తాతయ్య నానమ్మలో కూడా కొద్ది రోజులలోనే మార్పు వచ్చింది. ఈ కథంతా విని ఇది నా కథే అనుకుంటున్నారు కాబోలు. ఇది నా అన్నయ్య రామదాసు అనబడే ఏసుదాసు కథ. అమ్మ నాన్నలతో వారం క్రితం తాతయ్య అన్న మాటలు గుర్తొచ్చాయి. ఈ సమస్య చూడటానికి, వినటానికి చాలా చిన్నదిగా కనిపిస్తుంది. కానీ, భవిష్యత్‌లో ఇదే పెద్ద బండరాయి అయి నెత్తి మీద కూర్చుంటుంది. “నేను, మీ అమ్మ చనిపోతే నువ్వు పెద్ద కొడుకుగా వంశ వారసుడిగా మా తలకొరివి పెడతావు. అందరూ చనిపోయే వాళ్లే! మరి నువ్వు చనిపోతే చితి ఎవరు అంటిస్తారు? ఎవరు దహనం చేస్తారు? ఆ జాతి తక్కువ వాడే నీ పెద్ద కొడుకుగా నీకు తలకొరివి పెడతాడా? లేదంటే పెంపుడు కొడుకు కాబట్టి వాడిని కాదని.. నీ చిన్న కొడుకు చితి వెలిగిస్తాడా? ఇద్దరిలో ఎవరు ఈ వంశ వారసుడు?” గట్టిగా అరుసూఅడిగారు తాతయ్య.““ఆలూ లేదు సూలూ లేదు కొడుకుపేరు సోమలింగం అన్న సామెత మాదిరిగా.. ఇప్పుడు మా వయసు ముప్పై అయిదు సంవత్సరాలు. యాభై అరవై సంవత్సరాల తర్వాత చావు కోసం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం నాన్నగారు!” అన్నారు నాన్న కూడా కోపంగా. “నీకు ముప్పై అయిదు సంవత్సరాలు కాబట్టే నీకు ఏమి అర్థమవటం లేదు. నా స్నేహితుడు వైజాగ్ విశ్వనాథ్ మామయ్య తెలుసు కదా! వాడి దహన సంస్కారాలలో ఇదే సమస్య వచ్చింది. వాడికి పిల్లలు లేక కాపుల అబ్బాయిని పెంచుకున్నారు. వాడిని పెంపకం తీసుకున్న సంవత్సరం తిరగకముందే విశ్వనాథ్‌కు అబ్బాయి పుట్టాడు. విశ్వనాథ్ చనిపోయినపుడు పెంపుడు కొడుకైనా పెద్దవాడు కాబట్టి వాడే చితి ముట్టించాలనే వాదన వచ్చింది. కాదు.. రక్తం పంచుకున్న కొడుకు మాత్రమే లెక్కలోకి వస్తాడు. పెంపుడు కొడుకు బ్రాహ్మణుడే కాదు కదా! అని మరికొందరు వాదించారు. దహన సంస్కారాలకు వచ్చిన బ్రాహ్మణులు కూడా రెండు గ్రూపులుగా మారి.. చెరో వాదన వినిపించారు. ఆరోజు పెద్ద యుద్ధమే జరిగింది. ఉదయం జరగాల్సిన కార్యం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగింది” అన్నారు తాతయ్య. మా ఇంట్లో గత మూడు సంవత్సరాలుగా అంతా బాగానే ఉంది కానీ గత ఆరు నెలలుగా విచిత్రమైన మార్పు వచ్చింది. ముఖ్యంగా నానమ్మ, తాతయ్యలో వారసుడు, జాతి, కులం అనే పదాలు వినిపిస్తున్నాయి. తాతయ్యలో మార్పు మరీ ఎక్కువ. “నా రక్తం పంచుకుని పుట్టావు నువ్వు. నీ రక్తంతో పుట్టిన వాడే నా మనవడు, ఈ ఇంటి వారసుడు వాడే అవుతాడు” అని వాదించారు. “ఇంటికి వారసుడు వచ్చాడు కదా! ఇంక ఈ జాతి బదిలీ అయింది” అని గుర్తుచేస్తూ.. “వాడిని అనాథాశ్రమంలో చేర్పించే బదులుగా మిమ్మల్నే వృద్ధాశ్రమంలో చేరుస్తాను” అని గట్టిగా తిరుగు జవాబు ఇచ్చారు. బిడ్డలు లేరని పెంచుకున్న దాసు అన్నయ్య మీద సాధింపు ఎక్కువైంది. ఎలాగైనా వాడిని వదిలించకుందామని ప్రయత్నాలు మొదలు పెట్టారు తాతయ్య. అమ్మ, నాన్న మాత్రం దాసు అన్నయ్య వచ్చిన తర్వాత అంతా మంచే జరుగుతున్నదని నమ్ముతున్నారు. అమ్మ నాన్నలకు దాసు అన్నయ్య అంటే ఇష్టం తగ్గలేదు కానీ, తక్కువ వెధవ ఎందుకు? వాడిని అనాథ శరణాలయంలో వేయండి” అంటూ సలహా ఇచ్చారు కూడా. ఇక దాసు వచ్చిన తర్వాత ఎన్ని అనర్థాలు జరిగాయనేది తాతయ్య మరోసారి వల్లె వేసారు. దానికి సమాధానంగా నాన్న.. “వాడు వచ్చిన కొద్దిరోజులకే నేను ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందాను. నా భార్యకూడా దూరంగా ఉన్న స్కూల్ నుండి దగ్గరి స్కూలుకు బదిలీ అయింది” అని గుర్తుచేస్తూ.. “వాడిని అనాథాశ్రమంలో చేర్పించే బదులుగా మిమ్మల్నే వృద్ధాశ్రమంలో చేరుస్తాను” అని గట్టిగా తిరుగు జవాబు ఇచ్చారు. బిడ్డలు లేరని పెంచుకున్న దాసు అన్నయ్య మీద సాధింపు ఎక్కువైంది. ఎలాగైనా వాడిని వదిలించకుందామని ప్రయత్నాలు మొదలు పెట్టారు తాతయ్య. అమ్మ, నాన్న మాత్రం దాసు అన్నయ్య వచ్చిన తర్వాత అంతా మంచే జరుగుతున్నదని నమ్ముతున్నారు. అమ్మ నాన్నలకు దాసు అన్నయ్య అంటే ఇష్టం తగ్గలేదు కానీ, నానమ్మ–తాతయ్యలకు మాత్రం గత ఆరు నెలలుగా అన్నయ్య అంటే అయిష్టం పెరిగింది. అమ్మ–నాన్న ఇద్దరూ ఉద్యోగానికి వెళ్లిన తరువాత నానమ్మ దాసు అన్నయ్యతో.. “ఎందుకురా! మా ఇంట్లో దాపురించావు. మేము ఏ జన్మలో చేసుకున్న పాపమో రా ఇది. జాతి తక్కువ వెధవ!” అని తిట్టేదట. ఇలాంటి సూటిపోటి మాటలు, అమ్మ స్కూల్ నుండి వచ్చిన తర్వాత దాసు అన్నయ్య అమ్మతో చెప్పటం నేను గత ఆరు నెలలుగా వింటున్నాను. సమస్య ఇప్పుడు నా వల్ల చిలికి చిలికి గాలి వాన అయింది. పరిస్థితి ఎంతలా అయింది అంటే.. తాతయ్య మొన్న దాసు అన్నయ్యను ఆట కోసం తీసుకువెళ్తానని చెప్పి.. ఊరు చివర శ్మశానంలో వదిలిపెట్టి వచ్చాడు. అక్కడ శవాలు కాలుతుంటే చూసి భయపడి చనిపోతాడని తాతయ్య ఉద్దేశం. అయితే స్కూలు నుంచి వచ్చిన నాన్నగారు దాసు అన్నయ్యను వెతికి ఇంటికి తీసుకువచ్చారు.

# క్యాన్సర్‌పై వారికి అవగాహన ఉండాల్సిందే: బోండా ఉమ




**విజయవాడ, అక్టోబర్ 31:** ఇన్నర్ వీల్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రపంచం మొత్తం క్యాన్సర్‌ని జయించటం కోసం పోరాడుతోందన్నారు. క్యాన్సర్‌ని జయించాలంటే, మొట్టమొదటి పరిస్థితుల్లోనే దాన్ని డయాగ్నెస్ చేస్తే చాలా వరకు క్యూరైపోయే పరిస్థితి ఉంటుందని చెప్పారు. లేటెస్ట్ టెక్నాలజీ, లేటెస్ట్ ట్రీట్‌మెంట్‌తో అనేక క్యాన్సర్లకి మందులు, వ్యాక్సిన్ కూడా వచ్చాయని. దీన్ని సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా బెస్ట్ క్యాన్సర్‌తో పాటు సర్వైవల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను చూడాలన్నదే సీఎం చంద్రబాబు కల అని స్పష్టం చేశారు. మహిళలు, విద్యార్థినిలకు క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని సూచించారు. ఈ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా ప్రజలలో భయాన్ని తొలగిస్తాయన్నారు. ఇన్నర్‌విల్ క్లబ్ వంటి సంస్థలు ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. వారు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా.. ఉచిత స్క్రీనింగ్ టెస్ట్‌లను కూడా అందిస్తున్నారని తెలియజేశారు.ఇది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఎంతో సహాయపడుతుందన్నారు. ఆడపిల్లలు, యువత తమ ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలని సూచనలు చేశారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం వంటివి చాలా ముఖ్యమన్నారు. డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని ఎమ్మెల్యే బోండా ఉమ పేర్కొన్నారు.

# కల్తీ మద్యం కేసులో అధికారుల దూకుడు వైన్స్ లైసెన్స్ రద్దు



**విజయవాడ:** కల్తీ మద్యం కేసులో ఎక్సైజ్ అధికారులు దూకుడు పెంచారు. ఈ మేరకు భవానీపురంలోని శ్రీనివాస వైన్స్ లైసెన్స్ రద్దు చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి భవానీపురానికి నకిలీ మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విచారణలో భాగంగా కల్తీ మద్యం విక్రయంపై బార్ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం యజమానిని విచారించినట్లు వివరించారు. ఆయన ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందకపోవడంతో లైసెన్స్‌ను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.కల్తీ మద్యం కేసులో గతంలో ఇబ్రహీంపట్నంలోని మద్యం తయారీ యూనిట్‌ను అధికారులు తెరిచారు. ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్‌లో కనిపించిన నకిలీ మద్యం మరకలు విజయవాడలోని ఓ వైన్ షాపులో కనిపించాయి. అయితే విజయవాడ బార్ యజమాని, నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధనరావు భాగస్వామ్యంతో నగరంలో ఉన్న శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం విక్రయించినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు(శుక్రవారం) వైన్స్ లైసెన్స్‌ను రద్దు చేశారు.ఇటీవల రాష్ట్రంలో కల్తీ మద్యం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. కల్తీ మద్యానికి చోటివ్వకుండా, దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయించకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠ చర్యలు చేపట్టింది. బెల్టు దుకాణాల విషయంలో కఠిన వ్యవహరించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అలాగే అన్ని మద్యం షాపులపై అధికారులు నిఘా పెట్టారు.

# భారతి సిమెంట్ మేనేజర్‌పై కేసు నమోదు




**కడప:** భారతి సిమెంట్ మేనేజర్ భార్గవ్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ సీఎం జగన్ హయాంలో భూముల విషయంలో భార్గవ్‌రెడ్డి మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కడపకు చెందిన మహబూబ్‌ఖాన్ దగ్గర రూ.60 లక్షలు అడ్వాన్స్ తీసుకుని మొహం చాటేసినట్లు తెలుస్తోంది. దీంతో మహబూబ్‌ఖాన్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు ఆదేశాలతో భార్గవ్‌రెడ్డిపై సీకే దిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు.సీకే దిన్నె మండలం మామిళ్లపల్లె రెవెన్యూ గ్రామంలోని భూమిని రూ.10 కోట్లుండగా.. రూ. 3 కోట్లకే దక్కుతుందని కొంతమంది మహబూబ్‌ఖాన్‌కు నమ్మబలికారు. దీంతో నగదు చెల్లించి వ్యక్తులతో ఒప్పంద పత్రం రాయించుకున్నారు. ఎంతకూ వారు భూమి చూపకపోవడంతో ఆరా తీశారు. ఇతరుల పేరిట ఉన్నట్లు గుర్తించి మోసపోయానని గ్రహించారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం నెల రోజుల్లోపు కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు చేపట్టాలని న్యాయమూర్తి ఆదేశించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. ఈ భూ వ్యవహారంలో భారతి సిమెంట్ కంపెనీ మేనేజర్ భార్గవరెడ్డి కీలక పాత్రధారిగా ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భార్గవరెడ్డిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

# పాండురంగ స్వామి ఉత్సవాలు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి



**కృష్ణా జిల్లా, అక్టోబర్ 31:** జిల్లాలోని మచిలీపట్నంలో చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. (శుక్రవారం) నుంచి ఆరు రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్రసతీసమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయానికి వచ్చిన మంత్రికి మేళతాళాలు, పూర్ణ కుంభంతో ఉత్సవ కమిటీ స్వాగతం పలికింది. ఆపై స్వామివారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దంపతులతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పాండురంగడి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని తెలిపారు. నవంబర్ 2న స్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నామని చెప్పారు. 3న నాగులేరు కాలువలో తెప్పోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే 5వ తేదీన జరిగే కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలకు కూడా ఏర్పాట్లు చేశామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు

# బాధితుల గురించే మాట్లాడే అర్హత జగన్‌కు లేదు



**అమరావతి:** మొంథా తుఫాన్ బాధితుల గురించి మాట్లాడే.. అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. విపత్తు పరిశీలన అంటే రెడ్ కార్పెట్ వేసుకుని తిరిగిన జగన్‌కు ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. తుఫాను వల్ల పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగలేదన్నది జగన్ బాదేమో అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముందస్తు చర్య ల్లో భాగంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు విద్యుత్ శాఖ అప్రమత్తమైందని గొట్టిపాటి తెలిపారు.తుఫాన్ సమయంలో ఏ ఒక్కరికీ ప్రాణ నష్టం జరగకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేసిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. దాదాపు 1500 మంది విద్యుత్ శాఖ సిబ్బందిని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాలకు పంపించినట్లు పేర్కొన్నారు. నష్టం జరిగిన 24 గంటల్లోనే విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించామని తెలిపారు. దాదాపు 13వేల విద్యుత్ స్తంభాలు, 3 వేల కిలోమీటర్ల మేర కండక్టర్లు, 3 వేల మేర ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని మంత్రి వెల్లడించారు.వ్యవసాయ, ఆక్వాకు సంబంధించి వాలిపోయిన విద్యుత్ స్తంభాలు వంటివి మరో 48 గంటల్లో పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి రవికుమార్ తెలిపారు. కొన్ని చోట్ల గాలుల వేగం ఎక్కువగా ఉన్నందునే విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు చెప్పారు. తుఫాన్ సమయంలో విద్యుత్ సిబ్బంది కూడా ప్రాణాలు పణంగా పెట్టి నిర్విరామంగా పని చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు ప్రతీ ఒక్క విద్యుత్ సిబ్బందికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.

# ఏపీకి ఏకంగా రూ.29,662 కోట్లతో మరో భారీ ప్రాజెక్ట్




**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి భారీగా ప్రాజెక్టులు వచ్చాయి. ముంబైలో జరుగుతున్న ఇండియా మారిటైం వీక్-2025లో విశాఖపట్నం పోర్టు అథారిటీ వివిధ సంస్థలతో కలిసి రూ.39,216 కోట్ల విలువైన కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి దుగరాజపట్నంలో భారీ పోర్టుతో పాటు షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు రూ.29,662 కోట్ల ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రతినిధులు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా హెచ్‌డీ కొరియన్ షిప్ బిల్డర్స్ ఆఫ్‌షోర్ ఇంజినీర్స్ లిమిటెడ్‌తో కలిసి దుగరాజపట్నంలో మేజర్ పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుపై చర్చలు జరిగాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై విశాఖ పోర్టు, ఏపీ ప్రభుత్వ అధికారులు, హెచ్‌డీ కొరియన్ షిప్ బిల్డర్స్ ప్రతినిధులు చర్చించారు.మెకాన్ ఇండియా సంస్థతో రూ.3 వేల కోట్ల విలువైన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఆధునిక స్టాక్‌యార్డులు, రైల్వే సైడింగ్స్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు. స్టాక్‌యార్డులు అంటే వస్తువులను నిల్వ చేసే ప్రదేశాలు. రైల్వే సైడింగ్స్ అంటే రైళ్లు వచ్చి వెళ్లే ప్రత్యేక మార్గాలు. ఎన్‌బీసీసీతో రూ.500 కోట్ల విలువైన ఒప్పందం చేసుకున్నారు. ద్వారా హార్బర్ పార్కులో ఆధునికీకరణ పనులు జరుగుతాయి. హార్బర్ పార్కు అంటే ఓడరేవు ప్రాంతంలో ఉండే పార్కు. హడ్కోతో రూ.487.38 కోట్ల విలువైన మరో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, కార్గో బెర్తుల యాంత్రీకరణ, నవీకరణ, పర్యావరణ సహిత సాంకేతికత అమలు చేయనున్నారు. కార్గో బెర్తులు అంటే సరుకు రవాణా చేసే ఓడలు నిలిచే ప్రదేశాలు. యాంత్రీకరణ అంటే యంత్రాలతో పనులు చేయడం. పోర్టు ప్రాంగణంలో అంతర్గత ఫైవంతెనలు నిర్మించడానికి రైల్ వికాస్ లిమిటెడ్ సంస్థతో రూ.535 కోట్ల విలువ గల ఒప్పందం కుదిరింది. పోర్టు లోపల వాహనాలు సులభంగా వెళ్లడానికి ఈ ఫైవంతెనలు ఉపయోగపడతాయి. వీటితో పాటు మరికొన్ని ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందాలపై తరపున సంస్థ ఉప ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలు రాష్ట్రంలో అభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడతాయని భావిస్తున్నారు. మరోవైపు ముంబై ఇండియా మారిటైమ్ వీక్ -2025లో.. ఏపీలో అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎంవోయూ చేసుకున్నారు. ఇన్ ల్యాండ్ వాటర్ వే అథారిటీ ఆఫ్ ఇండియాతో ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఎంవోయూ చేసుకుంది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో రూ.150 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.

# కర్నూలు బస్సు ప్రమాద బాధితులకు మరో రూ.40 లక్షలు



**కర్నూలు:** సమీపంలో జరిగిన బస్సు ప్రమాద బాధితులకు వి.కావేరి ట్రావెల్స్ యాజమాన్యం ఆర్థికసాయం అందించింది. ఈ మేరకు మొత్తం రూ.40 లక్షల ఆర్థిక సహాయం అందించింది. ఈ నెల 24న జరిగిన ఈ దుర్ఘటనలో మరణించిన 19 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన నలుగురికి రూ.50 వేల చొప్పున ఈ మొత్తాన్ని అందజేశారు. కర్నూలు కలెక్టరేట్‌లో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టి.జి భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ నూరుల్ ఖమర్ సమక్షంలో వి.కావేరి ట్రావెల్స్ ప్రతినిధులు కలెక్టర్ డా. ఏ సిరికి ఈ చెక్కును అందజేశారు. ఈ మొత్తాన్ని ప్రమాద బాధితుల కుటుంబాలకు సకాలంలో అందజేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఏపీకి చెందిన ఏడుగురు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నారు. బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులు, గాయపడిన నలుగురి బ్యాంక్ అకౌంట్ల వివరాలు తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని కలెక్టర్ సిరి తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో వీరి బ్యాంక్ అకౌంట్‌లలో ఆర్థిక సాయం జమ అవుతుందని చెప్పారు. ఈ నెల 24న కర్నూలు శివారులో ఈ ప్రమాదం జరిగింది.. బస్సులో మంటలు చెలరేగడంతో 19మంది ప్రాణాలు కోల్పోయారు.. పలువురు గాయపడ్డారు. శివశంకర్ అనే యువకుడి బైక్ ప్రమాదం కారణంగా ఈ ఘటన జరిగింది. బైక్‌ను వీ కావేరి బస్సు ఢీకొట్టి లాక్కెళ్లింది.. ఈ క్రమంలో మంటలు చెలరేగడంతో బస్సు దగ్ధమైంది.ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. సీటర్ బస్సులను స్లీపర్ బస్సులుగా మార్చడం వంటి చట్టవిరుద్ధమైన పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరించారు. ఇలాంటి మార్పులు చేసేవారిని నేరుగా జైలుకు పంపించేలా కొత్త నిబంధనలు తీసుకొచ్చామన్నారు. ఇటీవల కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం ఈ విషయంలో కేంద్రాన్నిఅప్రమత్తం చేసింది. ఆ ప్రమాదానికి కారణం, బస్సును నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ బస్సుగా మార్చడమేనని మంత్రి గడ్కరీ తెలిపారు. ఈ సంఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కొత్తగా సవరించిన బస్ కోడ్‌లో, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠినమైన శిక్షలు విధించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చామని మంత్రి గడ్కరీ చెప్పారు. బస్సుల రూపకల్పన, మార్పులు వంటి విషయాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించడం తప్పనిసరి అని ఆయన నొక్కి చెప్పారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఆపద కాలంలో జగన్ వ్యాఖ్యలు అర్ధరహితం




**అమరావతి, అక్టోబర్ 31:** రాష్ట్రంలో విధ్వంసం జరిగితే చూసి ఆనందించాలన్నదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పంథా అని పొన్నూరు ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ. అతను అనుకున్న విధ్వంసం జరగలేదనే బాధ జగన్‌లో ఉందన్నారు. మోంథా తుపానును ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోవడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ఆపద సమయంలో ప్రభుత్వానికి- ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన జగన్ చేసే వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. జగన్ చేసే వ్యాఖ్యలు రాజకీయ లబ్ది కోసమే అని ఆరోపించారు. బెంగుళూరు ప్యాలెస్‌లో కూర్చుని జగన్ చేసే వ్యాఖ్యలు ఎవరూ నమ్మరని తెలిపారు.ఇన్సూరెన్స్ కట్టకుండా పంట భీమా చెల్లించామని జగన్‌లా కూటమి ప్రభుత్వం అసత్యాలు చెప్పదన్నారు. పంట నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అప్పుడు సీఎంగా జగన్ పొలంలో అడుగు పెట్టలేదని.. ఇప్పుడు కూడా అడుగు పెట్టటంలేదని విమర్శించారు. ఆపద కాలంలో జగన్ చేసే వ్యాఖ్యలు అర్ధరహితమని ధూళిపాళ్ల నరేంద్ర విమర్శలు గుప్పించారు.జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: యనమలతుపాను కూడా మానవ సృష్టి అని జగన్ అనటం హాస్యాస్పదమని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. విపత్తులు అనేవి ప్రకృతి కోపానికి సంకేతాలని, వాటిని మనుషులు సృష్టించలేరని జగన్ గ్రహించాలని హితవుపలికారు. 2024 ఎన్నికల్లో కూటమి సృష్టించిన రాజకీయ తుఫాను మాత్రం జగన్‌ను, ఆయన పార్టీని పూర్తిగా చెరిపేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ ఎప్పుడూ ప్రకృతి విపత్తుల ప్రాంతాలను సందర్శించలేదన్నారు. బెంగుళూరులో ఆస్తులను రక్షించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే జగన్‌కు ప్రజల సమస్యలు పట్టవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ముందస్తు, తుపాను తదనంతర చర్యలు ప్రశంసనీయమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల యజ్ఞం ప్రజల మద్దతు లేకుండా కేవలం నకిలీ సంతకాలతో నడుస్తోందని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

# పటేల్ కలలు సాకారం కోసమే సమైక్యత పరుగు




**విజయవాడ, అక్టోబర్ 31:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిసందర్భంగా విజయవాడలో ర్యాలీ నిర్వహించారు.(శుక్రవారం) ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ సాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ , ఎంపీ కేశినేని శివనాథ్ ఇతర నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ. దేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీయుడు సర్దార్ పటేల్ అని కొనియాడారు. ఆయన కలలు సాకారం చేసేలా ఆయన జయంతి రోజు సమైక్యత పరుగు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత దేశ తొలి హోమ్ మినిస్టర్‌గా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగా భారతదేశమంతా సమైక్యంగా ఉందన్నారు. స్వేచ్ఛతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఆయన 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పటేల్‌ను స్మరిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.దేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. దేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని మాధవ్ పేర్కొన్నారు. స్వాతంత్రం తర్వాత కూడా ఆయన నిరంతర కృషితో ప్రజల కోసం, దేశం కోసం పనిచేశారన్నారు.స్వాతంత్రం తర్వాత కూడా ఆయన నిరంతర కృషితో ప్రజల కోసం, దేశం కోసం పనిచేశారన్నారు. నిజాంలు స్వయం ప్రతిపత్తి కోరితే దేశమంత సమైక్యంగా ఉండాలని దేశంలో అందరూ భాగస్వామ్యం కావాలని వారికి గట్టిగా చెప్పిన వ్యక్తి పటేల్ అని చెప్పుకొచ్చారు. ఆయన నేతృత్వంలో జమ్మూకాశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు కూడా కృషి చేశారని తెలిపారు. ఆనాడు నెహ్రూ తొందరపాటు నిర్ణయం వల్ల నాటి నుంచి 2019 వరకు ఆ సమస్య అలాగే ఉందన్నారు.ప్రధాని మోడీ రెండోసారి అధికారంలోకి రాగానే 370 అధికరణ కింద జమ్ము కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేశార న్నారు. భారతదేశ ప్రజలందరూ స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేయాలని కోరారు. లోకల్ ఫర్ వోకల్ నినాదాన్ని అందుకొని మనవారిని మనమే ప్రోత్సహించుకోవాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ కూడా స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాలని బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ పిలుపునిచ్చారు.పటేల్ త్యాగానికి గుర్తింపుగా: ఎంపీ కేశినేనిసర్దార్ వల్లభాయ్ పటేల్ దేశం సమగ్రతను చాటారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సంస్థానాలు విలీనం చేశారన్నారు. పటేల్ త్యాగానికి గుర్తింపుగా ఏటా స్వతంత్ర దినోత్సవం మాదిరిగా ఏకతా ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. యూనిటీ మార్చ్‌ను ఆయన అడుగుజాడల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# పొత్తుపై టీవీకేతో మంతనాలు జరపలేదు



చెన్నై: వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల పొత్తు గురించి సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చర్చలు జరపలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వెల్లడించారు. స్వాతంత్ర సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 118వ జయంతి, 63వ వార్షిక గురుపూజోత్సవం సందర్భంగా రామనాథపురం జిల్లా పసుంపొన్ దేవర్ స్మారక మందిరంలో ఉన్న ఆయన శిలావిగ్రహానికి అన్నాడీఎంకే తరఫున మాజీమంత్రులతో కలిసి ఈపీఎస్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మదురై జిల్లా కబ్బలూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... విజయ్‌తో పొత్తుపై ఎలాంటి చర్చలు జరపలేదని, కూటమిపై రాయబారా లు జరుగుతున్నట్లు సొషల్‌మీడియాల్లో వచ్చే కథనాలు అవాస్తవాలన్నారు. తాను పాల్గొంటు న్న ప్రచార సభల్లో కొంతమంది టీవీకే జెండాలతో వచ్చి స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), మాజీమంత్రి సెంగోటయ్యన్, టీటీవీ దినకరన్ డీఎంకే బీటీంగా వ్యవహరిస్తున్నారని, వీరి కుట్రల వల్లే 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారంలోకి రాలేకపోయిందని విమర్శించారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి, పార్టీ నిబంధనలను అతిక్రమించేవారు ఎవరైనా సహించేది లేదని, అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలుం టాయని ఆయన మరోమారు హెచ్చరించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జాబితా సవరణపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఈపీఎస్ సమాధానం చెబుతూ, ఎస్ఐఆర్ అంటే సహజంగా భయపడాల్సింది ప్రతిపక్షాలలేనని, అయితే రాష్ట్రంలో అధికార డీఎంకే దీనిపై ఎందుకు ఆందోళన చెందుతుందో అర్థం కావడం లేదన్నారు. రైతుల నుండి ఏడాదికి సుమారు 42లక్షల టన్నుల దాన్యం కొనుగోలు చేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ అబద్ధాలు చెబుతున్నారని, ధాన్యం కొనుగోలుపై శ్వేతపత్రం విడుదల చేయా లని డిమాండ్ చేశారు. ముత్తురామలింగ దేవర్‌కు 'భారతరత్న' ప్రకటించాలని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ సమర్పించినట్లు ఈపీఎస్ తెలిపారు.

# చిల్లర రాజకీయాలు ఆపండి మోదీ వ్యాఖ్యలపై స్టాలిన్ స్ట్రాంగ్ కౌంటర్



తమిళనాడు: తమిళనాడులో ఉన్న బిహార్ ప్రజలపై డీఎంకే ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీచేసిన వ్యాఖ్యలు దక్షిణాది రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎలక్షన్స్‌లో భాగంగా మోదీ మాట్లాడు తూ. తమిళ నాడులో పనిచేస్తున్న వలస కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తావించా డు. ఇందులో భాగంగానే బిహారీ కార్మికులను డీఎంకే అవమానిస్తోందనీ, వారి పట్ల వేధింపులకు పాల్పడుతోందనీ మోదీ ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు."ఒక తమిళుడిగా నేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీని వినయంగా కోరుతున్నాను. ఆయన దేశ ప్రజలందరికీ ప్రధాని అనే గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారనే విషయాన్ని తరచుగా మర్చిపోతున్నారేమో అని నాకు బాధగా ఉంది. ఇలాంటి ప్రకటనల ద్వారా తన బాధ్యతకు తగిన గౌరవాన్ని ఆయన కోల్పోకూడదు. బీజేపీ సభ్యులు ఎక్కడికి వెళ్లినా ఒడిశా బిహార్ అని మాట్లాడుతూ, కేవలం ఎన్నికల రాజకీయాల కోసం తమిళులపై తమ ద్వేషాన్ని వ్యక్తపరుస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఇక్కడి ప్రజల తరపున నేను బీజేపీ సభ్యుల ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. వివిధ సంస్కృతులు, భిన్నత్వంలో ఏకత్వం గురించి గొప్పగా చెప్పుకునే భారతదేశంలో, హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వాన్ని పెంచడం, అలాగే తమిళులు బిహార్ ప్రజల మధ్య విరోధాన్ని సృష్టించే ఇటువంటి చిల్లర రాజకీయ పద్ధతులను మానుకోవాలని నేను ప్రధానమంత్రిని, బీజేపీ సభ్యులను కోరుతున్నాను. దయచేసి దేశ సంక్షేమంపై దృష్టి సారించండి." అంటూ స్టాలిన్ రాసుకోచ్చాడు.

# 'సర్దార్ కలను నెరవేర్చిన మోదీ'- వల్లభ్ భాయ్ పటేల్‌కు రాష్ట్రపతి, అమిత్ షా నివాళులు



న్యూ ఢిల్లీ :సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ్ ఏకతా దివస్‌ను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నా రు. దిల్లీలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకం వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నివాళులర్పించారు. ఆ తర్వాత సోషల్ మీడియా లో కూడా పోస్ట్ చేశారు. సర్దార్ పటేల్ గొప్ప దేశభక్తుడు, దార్శ నిక నాయకుడిగా కొనియాడారు. ఆయన తన అచంచల సంక ల్పం, అజేయమైన ధైర్యం, నైపుణ్యం కలిగిన నాయకత్వంతో దేశాన్ని ఏకం చేసే చరిత్రాత్మక పనిని సాధించారని చెప్పారు. ఆయన అంకితభావం, దేశానికి సేవ చేయడం మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. పటేల్ కలను మోదీని నెరవేర్చారు! అయితే సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ స్టేడియంలో రన్ ఫర్ యూనిటీని ప్రారం భించారు. ఆ సమయంలో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా సర్దార్ పటేల్ సమైక్య భారతదేశ కలను ప్రధాని మోదీ నెరవేర్చా రని అమిత్ షా తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, బ్రిటిష్ వారు దేశాన్ని 562 రాచరిక రాష్ట్రాలుగా విభజించి వదిలివేయాలని నిర్ణయించుకున్నారని షా అన్నారు."ఆ సమయంలో 562 సంస్థానాలను ఒకే దేశంగా ఏకం చేయడం అసాధ్యమని ప్రపంచం మొత్తం భావించింది. అయితే, తక్కువ సమయంలోనే సర్దార్ పటేల్ 562 సంస్థానాలను ఏకం చేసే బృహత్ కార్యాన్ని పూర్తి చేశారు. నేడు మనం చూస్తున్న ఆధునిక భారతదేశ పటం ఆయన దార్శనికత, ప్రయత్నాల ఫలితమే. కొన్ని రాష్ట్రాలు విలీనం కావడానికి ఇష్టపడలేదు. కానీ సర్దార్ పటేల్ ప్రతి సమస్యను దృఢ సంకల్పంతో పరిష్కరించారు" అని అమిత్ షా అన్నారు. ఆర్టికల్ 370 కారణంగా జమ్ముకశ్మీర్ పూర్తిగా భారతదేశంలో విలీనం కాలేదని కాబట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్టికల్‌ను రద్దు చేయడం ద్వారా సర్దార్ పటేల్ పనిని సాధించారని తెలిపారు. ఇప్పుడు మన దగ్గర 'అఖండ భారత్' ఉందని షా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సమైక్య భారతదేశ నిర్మాత సర్దార్ పటేల్‌కు తగిన గౌరవం ఇవ్వలేదని, గొప్ప వ్యక్తికి కూడా 41 సంవత్సరాల ఆలస్యం తర్వాత భారతరత్న లభించిందని ఆయన అన్నారు."దేశంలో ఎక్కడా స్మారక చిహ్నం నిర్మించలేదు. మోదీ జీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పుడు మాత్రమే ఆయన స్టాట్యూ ఆఫ్ యూనిటీని రూపొందించి, సర్దార్ పటేల్ గౌరవార్థం ఒక గొప్ప స్మారక చిహ్నాన్ని నిర్మించారు. 2013 అక్టోబర్ 31న స్టాట్యూ ఆఫ్ యూనిటీకి పునాది రాయి వేశారు. దేశం అంతటా సేకరించిన రైతుల పనిముట్ల నుంచి ఇనుమును ఉపయోగించి 182 మీటర్ల పొడవైన విగ్రహాన్ని కేవలం 57 నెలల్లోనే పూర్తి చేశాం. ఈ పనిముట్లను సేకరించి కరిగించి విగ్రహ నిర్మాణంలో దాదాపు 25,000 టన్నుల ఇనుమును ఉత్పత్తి చేశాం" అని తెలిపారు. భారతదేశం, విదేశాల నుంచి 2.5 కోట్లకు పైగా సందర్శకులతో, స్టాట్యూ ఆఫ్ యూనిటీ భారతీయ ఇంజనీరింగ్ నిజమైన అద్భుతంగా ఉద్భవించిందని షా అన్నారు.

# చేతులు ఎత్తితే సభాపతి కావచ్చు ఎమ్మెల్యే కాలేరు



బెంగళూరు: రాజకీయాలలో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే కానీ ఇటీవల అన్ని విషయాలలోను కాంగ్రెస్‌కు చెందిన వారు హాట్‌టాపిక్ గా మారుతున్నారు. అటువంటి వారిలో చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్( కూడా ఒకరు. ఇటీవల మీడియాతో మాట్లాడిన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రదీప్ ఈశ్వర్ ఓ ఆకస్మిక ఎమ్మెల్యే అన్నారు. అందుకు ప్రదీప్ ఈశ్వర్ శుక్రవారం స్పందిస్తూ.. పరిషత్‌లో సభ్యులు చేతులు ఎత్తితే సభాపతి కాగలరని కానీ ఎమ్మెల్యే కావడం సాధ్యం కనీసం లక్ష ఓట్లు కావాలన్నారు. అయితే ప్రదీప్ ఈశ్వర్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సభాపతి బసవరాజ హొరట్టి ఏడుసార్లు వరుసగా ఒకే స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు. అటువంటి చరిత్ర కలిగిన వారు బహుశా దేశంలోనే లేరు. అటువంటి సీనియర్ నేతపైనా నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని విమర్శలు వ్యక్తం కాగా కొందరు ప్రదీప్ ఈశ్వర్‌కు మద్దతుగాను సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

# అమెరికా నుంచి భారత్‌కు 2,790 మంది గుర్తింపును మేమే ధ్రువీకరించాం: కేంద్రం



న్యూ ఢిల్లీ :అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వేలాది భారతీయులపై చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివ రకు అమెరికాలో చట్టవ్యతిరేకంగా ఉన్న 2,790 మందికిపైగా భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. 'జాతీయతను, గుర్తింపును మేమే ధ్రువీకరించాం' "ఈ సంవత్సరం జనవరి నుంచి అక్టోబర్ 29వ తేదీ వరకు అమెరికాలో చట్టబద్ధమైన వీసాలు లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి నివసించిన 2,790 మందికిపైగా భారత పౌరులు స్వదేశానికి తిరిగి వచ్చారు. వారి జాతీయతను, గుర్తింపును మేమే ధ్రువీకరించాం. ఆ తర్వాత వారిని అమెరికా నుంచి వెనక్కి పంపించారు" అని రణధీర్ జైశ్వాల్ తెలిపారు. అమెరికా ప్రభుత్వం భారత మిషన్లతో సమన్వయం సాధించి ఈ చర్యలు చేపట్టింది. "వారి వివరాలు పరిశీలించి, నిజమైన భారతీయులేనని నిర్ధరించిన తర్వాతే వారిని వెనక్కి పంపించే ప్రక్రియ పూర్తయింది. ఇది అక్టోబర్ 29 వరకూ ఉన్న లెక్క" అని ఆయన వివరించారు. అమెరికాతో పాటు యునైటెడ్ కింగ్డమ్ (యూకే) నుంచి కూడా ఈ ఏడాది బహిష్కరణకు గురైన భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చారు. 'ఏజెంట్ల మోసాలకు బలై అక్రమ మార్గాల్లో వెళితే'ఈ ఏడాది సుమారు వందమంది భారతీయులు యూకే నుంచి వచ్చారని తెలిపారు. అయితే విదేశాంగశాఖ ప్రతినిధి జైశ్వాల్ మరిన్ని సూచనలు చేశారు. "విదేశాలకు వెళ్ళాలనుకునే వారు చట్టబద్ధ మార్గాల ద్వారానే వెళ్లాలి. ఏజెంట్ల మోసాలకు బలై అక్రమ మార్గాల్లో ఎవరైనా వెళితే ఇలాంటి సమస్యలు తప్పవు. వీసా గడువు ముగియకముందే దేశానికి తిరిగి రావాలి" అని సూచించారు. ఇక, అమెరికాలో రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత వలస నియమాలను మరింత కఠినతరం చేశారు. చట్టవ్యతిరేకంగా అమెరికాలో అడుగుపెట్టినవారిని గుర్తించి, ప్రత్యేక విమానాల ద్వారా తమ దేశాలకు పంపే చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇటీవల వేలాది మంది భారతీయులు, లాటిన్ అమెరికా దేశాల పౌరులు, ఆఫ్రికా దేశాల వలసదారులు తమ తమ దేశాలకు వెనుది రిగారు. అక్రమ వలసలు కేవలం వ్యక్తిగత సమస్య కాదు, వ్యవస్థీకృత నేరాలతో కూడిన పెద్ద అంశ మని భారత ప్రభుత్వం భావిస్తోంది. గతంలో కూడా విదేశాంగశాఖ ఈ విషయంపై స్పష్టమైన అభిప్రాయం వెల్లడించింది. అక్రమ వలసలు మానవ అక్రమ రవాణా, మోసపూరిత ఏజెన్సీల కార్యకలాపాలతో ముడిపడి ఉన్నాయని, దీనిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. వీసా గడువు ముగిసినా లేదా సరైన పత్రాలు లేకుండా విదేశాల్లో ఉన్న భారతీయులను తిరిగి తీసుకురావడంలో భారత ప్రభుత్వం ఎప్పుడూ సహక రిస్తోందని విదేశాంగశాఖ పునరుద్ఘాటించింది. అమెరికా, యూకే వంటి దేశాలతో పౌరుల ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతం చేయ డంపై కూడా కేంద్రం దృష్టి పెట్టింది. నిపుణులు కూడా ఈ అంశ ంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా, కెనడా వంటి దేశాలకు అక్రమ వలసల ప్రయత్నాలు ఇటీవల పెరిగాయని, మోసపూరిత ఏజెన్సీలు యువతను తప్పుదారి చెబుతున్నారు.

# కేజ్రీవాల్ కోసం మరో శీష్ మహల్



న్యూఢిల్లీ: శీష్ మహల్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎనిమిది నెలల క్రితం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'శీష్ మహల్' (అద్దాలమేడ) అంశం అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీని గట్టి దెబ్బ తీసింది. తాజాగా అరవింద్ కేజ్రీవా ల్‌కు ఛండీగఢ్‌లో 7 స్టార్ భవనం కేటాయించారంటూ బీజేపీ ఆరోపణలు చేసింది. ఇందుకు సంబంధించిన ఏరియల్ వ్యూ ఫోటోను కూడా షేర్ చేసింది.'సాధారణ వ్యక్తిగా చెప్పుకునే అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించిన మరో శీష్ మహల్ ఇది' అంటూ బీజేపీ ఆ ట్వీట్‌లో పేర్కొంది. ఢిల్లీ 'శీష్ మహల్'ను ఖాళీ చేసిన తర్వాత పంజాబ్ సూపర్ సీఎంగా చలామణి అవుతున్న కేజ్రీవాల్‌కు అంతకంటే ఖరీదైన, విశాలమైన శీష్ మహల్‌ను ఛండీగఢ్‌లోని సెక్టార్-2లో నిర్మించారని తెలిపింది. రెండెకరాల్లో విస్తరించి ఉన్న ఈ శీష్ మహల్‌ను పంజాబ్ ప్రభుత్వం కేటాయించినట్టు తెలిపింది. కాగా, ఈ ఫోటోను ముందుగా ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతీ మాలీవాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. గత ఏడాది మేలో స్వాతి మాలివాల్, కేజ్రీవాల్ మధ్య సంబంధాలు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి.కాగా, శీష్ మహల్ 2.0 అంటూ బీజేపీ షేర్ చేసిన ఫోటోపై కేజ్రీవాల్ కానీ, ఆప్ కానీ వెంటనే స్పందించలేదు. ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాను కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు రూ.45 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నిర్మించారంటూ బీజేపీ అప్పట్లో తీవ్ర విమర్శలు గుప్పించింది. దీనిని అసెంబ్లీ ఎన్నికల ప్రచారాస్త్రంగా కూడా మార్చుకుంది. ఈ ప్రచారం ఆప్ విజయావకాశాలను గండికొట్టింది. ఢిల్లీలోని శీష్ మహల్‌ను గెస్ట్ హౌస్‌గా కన్వర్ట్ చేస్తామని ఢిల్లీ బీజేపీ సర్కార్ కొద్దిరోజుల క్రితం ప్రకటించింది.

# సారీ పత్ర'ను విడుదల చేసి ఉండాల్సింది- ఎన్‌డీఏ 'సంకల్ప్ పత్ర'పై విపక్ష సీఎం అభ్యర్థి తేజస్వి ఫైర్




బిహార్: అధికార ఎన్‌డీఏ కూటమి విడుదల చేసిన బిహార్ ఎన్నికల మేనిఫెస్టోపై విపక్ష పార్టీలు జేడీయూ, కాంగ్రెస్ విమర్శలు గుప్పి ంచాయి. సీఎం నీతీశ్ కుమార్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకు న్నాయి. బిహార్ ప్రజలకు ఇచ్చిన పాత హామీల అమలుకే దిక్కు లేనప్పుడు, మేనిఫెస్టోలో కొత్త హామీలను ఎందుకిచ్చారని ఎన్‌డీఏ కూటమిని ఆర్‌జేడీ అగ్రనేత, విపక్ష 'మహాగఠ్?బంధన్? ' కూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైనందుకు 'సంకల్ప్ పత్ర'కు బదులుగా 'సారీ పత్ర'ను ఎన్‌డీఏ కూటమి విడుదల చేసి ఉండాల్సిందని ఎద్దేవా చేశారు. సీఎం నీతీశ్ కుమార్ ఆరోగ్యం సరిగ్గా లేదని, కనీసం మేనిఫెస్టోలో ఏయే అంశాలు ఉన్నాయనేది ఆయనకు తెలిసి ఉండకపోవచ్చని తేజస్వి ఆరోపించారు. గత 20 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఎన్‌డీఏ కూటమే పాలిస్తోందని, అయినా పేద రాష్ట్రంగానే బిహార్ మిగిలిపోయిందన్నారు. ఈ వైఫల్యానికిగానూ 'సారీ పత్ర'ను విడుదల చేసి, 14 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 20 ఏళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు"ఎన్‌డీఏ హయాంలో బిహార్‌కు ఒక్క ఫ్యాక్టరీ కూడా రాలేదు. ఎలాంటి పెట్టుబడులు రాలేదు. అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం ఫెయిలైంది. గత 20 ఏళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఎన్ని నెరవేర్చలేదు అనేది మేనిఫెస్టో ద్వారా ప్రజలకు తెలియజేసి ఉండాల్సింది. బిహార్‌లో మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలను నిర్మిస్తామని ఎన్‌డీఏ కూటమి గతంలో చెప్పింది. కానీ ఉన్న ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లోనే డాక్టర్లు, నర్సులు తగిన సంఖ్యలో లేరు. ప్రజలకు సరిగ్గా వైద్యం అందడం లేదు. అందుకే రాష్ట్ర ప్రజలకు ఎన్‌డీఏ క్షమాపణలు చెప్పాలి. అధికార కూటమి క్యారెక్టర్‌ను, పోకడను ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు. ఇక మాకు విజయం ఖాయం. నిరుద్యోగితను నిర్మూలించేందుకు మా వెంటే ప్రజలు నిలువనున్నారు" అని తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. సీఎం కాకుండా డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడారు : కాంగ్రెస్‌ఎన్‌డీఏ కూటమి ఎన్నికల మేనిఫెస్టోపై సీఎం నీతీశ్ కుమార్ కాకుండా, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి ఎందుకు మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్? ప్రశ్నించారు. కనీసం మేనిఫెస్టోపై మాట్లాడే స్థితిలో నీతీశ్ లేరా అని ఆయన నిలదీశారు. మేనిఫెస్టోపై మీడియాకు 26 సెకన్ల వివరణ ఇచ్చి ఎందుకు సరిపెట్టారో చెప్పాల్సిన బాధ్యత సీఎం నీతీశ్‌పై ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఇంత చిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌ను చూడటం ఇదే తొలిసారి అని మీడియా ప్రతినిధులు తనతో చెప్పారని అశోక్ గహ్లోత్? పేర్కొన్నారు. జేపీ నడ్డా, సీఎం నీతీశ్ సహా పలువురు ముఖ్య నేతలు 26 సెకన్లే మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొని వెళ్లిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మీడియాకు, ప్రశ్నలకు ఎందుకు భయపడుతున్నారని వారిని ఆయన ప్రశ్నించారు. సీనియర్ నేత అశోక్ గహ్లోత్, పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ యాదవ్ కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని, ఎన్నికల్లో కీలకమైన మేనిఫెస్టో విడుదల ఘట్టాన్ని అపహాస్యం చేసేలా ఎన్‌డీఏ కూటమి వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు. మేనిఫెస్టోపై ఎన్‌డీఏ కూటమికి నమ్మకం లేనట్టుగా కనిపిస్తోందని, ఒకవేళ నమ్మకం ఉంటే దాని గురించి ప్రజలకు లోతుగా వివరించి ఉండేవాళ్లన్నారు.

# దేశ సమగ్రత కోసం కృషి చేసిన గొప్ప నేత వల్లభాయి పటేల్ : ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నీలగిరి, అక్టోబర్ 31: దేశ సమగ్రత, ఐక్యత కోసం కృషి చేసిన గొప్ప దేశభక్తుడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ అని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా 2కె రన్ను ఆయన జండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో శీలక పాత్ర పోషించి, 550 కి పైగా సంస్థానాలను భారత దేశంలో విలీనం చేసేందుకు దృఢ సంకల్పంతో ఎలాంటి వత్తిడికి లొంగకుండా కీలక పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయి పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాజశేఖర్ రెడ్డి, మహా లక్ష్మయ్య, రాఘవరావు, ఎస్ఐలు సైదులు, ప్రజాబాబు, గోపాల్రావు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 12వ బెటాలియన్ లో. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా అన్నేపర్తిలోని 12వ బెటాలియన్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ కె.వీరయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమాండెంట్ నర్సింగ్ వెంకన్న, ఆండలు, ఆర్ఎస్ఐబలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఈ సీజన్‌లో రోజూ ఒక నారింజ పండును తినడం మరిచిపోకండి..!



నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. ఈ పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటి వాసన చూస్తే చాలు చాలా ప్రశాంతమైన ఫీలింగ్ కలుగుతుంది. తాజాదనపు అనుభూతిని ఇస్తాయి. నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. ఈ పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటి వాసన చూస్తే చాలు చాలా ప్రశాంతమైన ఫీలింగ్ కలుగుతుంది. తాజాదనపు అనుభూతిని ఇస్తాయి. నారింజ పండ్లలో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. ఈ సీజన్‌లో కచ్చితంగా రోజుకు ఒక నారింజ పండును తప్పనిసరిగా తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వేసవి కాలంలో సహజంగానే మన శరీరంలోని ద్రవాలు త్వరగా ఆవిరైపోతుంటాయి. మూత్రం కన్నా చెమట ఎక్కువగా వస్తుంది. అయితే ఈ సమస్యను తగ్గించేందుకు, మూత్రం ఎక్కువగా వచ్చేలా చేసేందుకు నారింజ పండ్లు దోహదం చేస్తాయి. దీంతో శరీరంలోని ద్రవాలు పోకుండా ఉంటాయి. అలాగే వ్యర్థాలు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లి పోయి శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది.

**రోగ నిరోధక శక్తికి..**

నారింజ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. తరచూ దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధుల బారిన పడుతున్నవారు నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

నారింజ పండ్లలో ఉండే విటమిన్ సితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా చర్మ కణాలు డ్యామేజ్ అవకుండా ఉంటాయి. దీంతో చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం ఎల్లప్పుడూ కాంతివంతంగా ఉండి ప్రకాశిస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. సినీ తారలు చాలా మంది నారింజ పండ్లను రోజూ తింటారు. అందుకనే వారు వృద్ధాప్య వచ్చినా కూడా యవ్వనంగానే కనిపిస్తారు. కాబట్టి మీరు కూడా ఎల్లప్పుడూ యవ్వ నంగా కనిపించాలంటే నారింజ పండ్లను తింటుండాలి.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..**

ఈ పండ్లలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ముఖ్యంగా అజీర్తి సమస్య తగ్గుతుంది. భోజనం చేశాక కొందరికి సరిగ్గా జీర్ణం కాదు. అలాంటి వారు నారింజ పండ్లను తింటుండాలి. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు ఉన్నవారు కూడా ఈ పండ్లను తింటే ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. మలబద్ధకానికి కూడా నారింజ పండ్లు చక్కని ఔషధంలా పనిచేస్తాయి. మలబద్ధకం ఉన్నవారు నారింజ పండును రోజుకు ఒకటి తింటుంటే ఫలితం ఉంటుంది. నారింజ పండ్లలో ఉండే విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు గాయాలు, పుండ్లను త్వరగా మానేలా చేస్తుంది. గాయాలు లేదా పుండ్లు అయిన వారు రోజుకు ఒక నారింజ పండును తింటుంటే త్వరగా వాటిని మానేలా చేయవచ్చు

**అధిక బరువు తగ్గేందుకు..**

అధిక బరువును తగ్గించేందుకు కూడా నారింజ పండ్లు ఎంతో దోహదం చేస్తాయి. ఈ పండ్లను తినడం వల్ల చాలా తక్కువ క్యాలరీలు లభిస్తాయి. అలాగే ఫైబర్ అధికంగా లభిస్తుంది కనుక ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో బరువు తగ్గవచ్చు. నారింజ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కణజాలాన్ని రక్షిస్తాయి. వ్యాధుల బారిన పడకుండా చూస్తాయి. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఎందుకంటే నారింజ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. ఈ పండ్లు తియ్యగా ఉన్నప్పటికీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కనుక షుగర్ ఉన్నవారు ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు. ఇలా నారింజ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..? అయితే మీరు సరిగ్గా నిద్రించడం లేదని అర్థం..!


మనం ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. దీంతోపాటు రోజూ వ్యాయామం కూడా చేయాలి. అలాగే వేళకు భోజనం చేయాలి. సమయానికి నిద్రించాలి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. దీంతో పాటు రోజూ వ్యాయామం కూడా చేయాలి. అలాగే వేళకు భోజనం చేయాలి. సమయానికి నిద్రించాలి. రోజుకు తగినన్ని గంటల పాటు నిద్రపోవాలి. అప్పుడే మనం అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటాం. కానీ ప్రస్తుతం నడుస్తున్న ఉరుకుల పరుగుల బిజీ యుగం కారణంగా చాలా మంది నిత్యం అనేక సంద ర్భాల్లో ఒత్తిడిని ఎదుర్కొంటూ సరిగ్గా నిద్ర పోవడం లేదు. దీంతో అనేక జీవనశైలి వ్యాధులు వస్తున్నాయి. అధికంగా బరువు పెరుగుతు న్నారు. టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బుల బారిన పడుతున్నారు. వీటన్నింటికీ ప్రధాన కారణం నిద్రలేకపోవడమే అని సైంటిస్టులు తమ అధ్యయనాల ద్వారా చెబుతున్నారు. ఈ క్రమంలోనే మనం సరిగ్గా నిద్రించకపోతే మన శరీరం పలు లక్షణాలను తెలియజేస్తుంది. వాటిని గుర్తించడం ద్వారా నిద్రసరిగ్గా పోవడం లేదని అర్థం చేసుకోవచ్చు.

**తీవ్రమైన అలసట..**

ముందు రోజు రాత్రి సరిగ్గా నిద్రలేకపోతే ఉదయం నిద్ర లేచిన వెంటనే అలసటగా ఉంటుంది. చిన్న పని చేసినా అలసిపోయినట్లు నీరసంగా మారిపోతారు. నిద్ర సరిగ్గా లేదని చెప్పేందుకు ఇది ప్రధాన లక్షణం. అలాగే సరిగ్గా నిద్రించకపోతే మెదడు మొద్దుబారిపోయినట్లు అవుతుంది. దీంతో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. ఏ పని మీద ఏకాగ్రత ఉండదు. బద్ధకంగా అనిపిస్తుంది. ఏ పని కూడా చేయాల నిపించదు. సరిగ్గా నిద్రించకపోతే హార్మోన్లపై ప్రభావం పడుతుంది. ఇవి డిప్రెషన్‌ను కలిగిస్తాయి. సరిగ్గా నిద్రలేకపోతే ఆ రోజంతా విచారంగా, మూడీగా ఉంటారు. ఏదో కోల్పోయినట్లు దిగులుగా ముఖం పెడతారు. విచారంతో ఇబ్బ ందిపడతారు.

**ఆహారాన్ని అతిగా తినడం..**

నిద్ర సరిగ్గా లేని వారు ఆహారం అధికంగా తింటారని వైద్యులు చెబుతున్నారు. మీరు కూడా ఆహారాన్ని అతిగా తింటున్నారేమో చెక్ చేసుకోండి. ఇందుకు నిద్రలేమిని ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇలా జరిగితే అధిక ంగా బరువు పెరుగుతారు. అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దీంతో ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. సరిగ్గా నిద్రలేకపోతే దాని ప్రభావం మన శరీర రోగ నిరోధక వ్యవస్థపై కూడా పడుతుంది. రోగ నిరోధక శక్తితగ్గుతుంది. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా మారుతుంది. దీర్ఘకాలంగా ఇది జరిగితే తరచూ దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. అవి అసలు ఒక పట్టాన తగ్గవు. ఈలక్షణాలన్నీనిద్రలేమినిసూచిస్తాయి.



**కళ్లపై ప్రభావం..**

సరిగ్గా నిద్రించకపోతే వాహనాలను డ్రైవింగ్ చేయడంలో ఇబ్బంది పడుతుంటారు. రోడ్డు మీద ధ్యాస ఉండదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. సరిగ్గా నిద్రించని ప్రభావం కళ్లపై కూడా పడుతుంది. అలాంటి వారికి కళ్లు మసకగా కనిపిస్తుంటాయి. సరిగ్గా నిద్రిస్తే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. సరిగ్గా నిద్రలేని వారు ఆహారం అధికంగా తీసుకుని బరువు కూడా పెరుగుతారు. ఇది షుగర్ వ్యాధికి కూడా కారణం అవుతుంది. కనుక మనం రోజూ తగినన్ని గంటల పాటు కచ్చితంగా నిద్రించాలి. రాత్రి 10 గంటల వరకు నిద్రించి ఉదయాం 5 లేదా 6 గంటలకు నిద్ర లేవాలి. తరువాత వ్యాయామం చేయాలి. అనంతరం మీకు కావల్సిన పనులను చేసుకోవచ్చు. ఇలాంటి దినచర్యను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఫిట్ నెస్ నిపుణులు సూచిస్తున్నారు.

# మీ శరీరం ఈ లక్షణాలను తెలియజేస్తుందా..? అయితే పొటాషియం లోపం ఉన్నట్లే..!

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక రకాల పోషకాలు అవసరం అవుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కనుకనే రోజూ అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవా లని పోషకాహాన నిపుణులు, వైద్య నిపుణులు చెబుతుంటారు. మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక రకాల పోషకాలు అవసరం అవుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కనుకనే రోజూ అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని పోషకాహాన నిపుణులు, వైద్య నిపుణులు చెబుతుంటారు. మన శరీరానికి కావల్సిన అన్ని పోషకాలు సక్రమంగా లభిస్తేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. రోగాలు రాకుండా ఉంటాయి. పోషకాల లోపం వస్తే మన శరీరం పలు లక్షణాలను తెలియజేస్తుంది. ఇక మన శరీరానికి అవసరం అయిన ముఖ్యమైన పోషకాల్లో ఒకటైన పొటాషియం లోపిస్తే కూడా శరీరం పలు సంకేతాలను సూచిస్తుంది. దాన్ని బట్టి పొటాషియం లోపం వచ్చిందని అర్థం చేసుకోవచ్చు.

**ద్రవాలు సమతుల్యంలో..**

పొటాషియం మన శరీరంలో ద్రవాలను సమతుల్యంలో ఉంచుతుంది. శరీరంలో రక్త సరఫరా ను మెరుగు పరుస్తుంది. ఇది లోపిస్తే ఆయా పనులకు ఆటంకం ఏర్పడుతుంది. పొటాషియం స్థాయిలు శరరీంలో తక్కువగా ఉంటే కండరాల్లో అసౌకర్యం ఏర్పడుతుంది. కండరాలు దృఢంగా, గట్టిగా మారుతాయి. ఆ ప్రాంతం మీద చేతితో టచ్ చేస్తే స్పర్శ లేనట్లు అనిపిస్తుంది. శరీరంలో పొటాషియం స్థాయిలు తగ్గితే తీవ్రమైన అలసట, నీరసం కనిపిస్తాయి. చిన్న పని చేసినా విపరీతమైన అలసట వస్తుంది. బలహీనంగా ఉన్నట్లు అనిపిస్తుంది. పొటాషియం లోపం ఉంటే కండరాలు బలహీనంగా మారుతాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోతుంటాయి. దీంతో నొప్పి విపరీతంగా ఉంటుంది.

**రక్త సరఫరాకు..**

పొటాషియం మన శరీరంలో రక్త సరఫరాను నియంత్రిస్తుంది. పొటాషియం తగినంతగా లేకపోతే రక్త సరఫరాపై నియంత్రణ ఉండదు. దీంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఈ లక్షణం కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవాలి. అలాగే పొటాషియం తక్కువగా ఉంటే కొందరికి మలబద్ధకం సమస్య కూడా వస్తుంది. జీర్ణక్రియ సాఫీగా జరగదు. తిన్న ఆహారం సులభంగా జీర్ణం కాదు. దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం ఏర్పడుతాయి. మలబద్ధకంతో ఇబ్బందులు పడుతుంటారు. పొటాషియం లోపం వల్ల శరీరంలో కొన్ని భాగాలపై టచ్ చేస్తే కొందరికి స్పర్శ లేనట్లు అనిపిస్తుంది.

**షుగర్ లాంటి లక్షణాలు..**

షుగర్ బారిన పడిన వారికి తరచూ దాహంగా అనిపించడం, తరచూ మూత్ర విసర్జనకు వెళ్లడం వంటి సమస్యలు వస్తాయన్న సంగతి తెలిసిందే. అయితే పొటాషియం లోపం ఉన్నా కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కనుక దీన్ని షుగర్ కావచ్చని కొందరు అనుమానిస్తారు. అయితే షుగర్ టెస్ట్ చేయిస్తే అసలు విషయం తెలిసిపోతుంది. ఒక వేళ షుగర్ లేకున్నా ఈ లక్షణాలు కనిపిస్తుంటే దాన్ని పొటాషియం లోపంగా అనుమానించాలి. డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాలి. పొటాషియం లోపం వల్ల శ్వాసకకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఊపిరితిత్తులు ఇబ్బందులకు గురవుతాయి. అందుకనే శ్వాసకు సమస్యగా ఉంటుంది. ఇక పొటాషియం మనకు పలు ఆహారాల్లో లభిస్తుంది. అరటి పండ్లు, నారింజ, పాలకూర, చిలగడదుంపలు, అవకాడో, బీన్స్, పెరుగు, చేపలు, ఆలుగడ్డలు, టమాటాలు వంటి ఆహారాల ను తింటుంటే పొటాషియం లోపం నుంచి బయటపడవచ్చు.





# శనివారం రోజున పొరపాటున ఈ 7 పనులు చేస్తే.. జీవితంలో కష్టాలకు వెల్కం చెప్పినట్లే..



జ్యోతిషశాస్త్రంలో శనీశ్వరుడు కర్మ ప్రదాత. న్యాయాధిపతిగా పేర్కొంది. జ్యోతిషశాస్త్రంలో శనిశ్వరుడిని అత్యంత క్రూరమైన గ్రహంగా పరిగణిస్తారు. శని దేవుడు మంచి చెడుల ఆధారంగా ఫలితాలను ఇస్తాడు. అయితే అదే సమయంలో కొన్ని పనులు చేస్తే చాలా కోపంగా ఉంటాడు. అటువంటి పరిస్థితిలో శనీశ్వరుడు ఆగ్రహాన్ని ఎదుర్కోకూడదను కుంటే.. కొన్ని ముఖ్యమైన విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇలా చేయడం వల్ల జీవితంలో వచ్చే కొన్ని సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. హిందూ మతంలో వారంలో ఒకొక్క రోజు ఒకొక్క దేవుడికి అంకితం చేశారు. శనివారం సూర్య భగవానుడి కుమారుడు శనీ శ్వరుడు రోజుగా పరిగణించబడుతుంది. శనీశ్వ రుడు కర్మలను అనుసరించి శిక్షలను ఇచ్చే న్యాయ దేవుడు అని చెబుతారు. శని దేవుడు కర్మ ఆధారిత గ్రహం. అయితే శనీశ్వరుడు అనుగ్రహం కొన్ని పనులు చేయడం వలన కలిగితే.. అంటే కష్టపడి పనిచేసే వ్యక్తుల పట్ల, పేదలకు సహాయం చేవారి పట్ల శనీశ్వరుడు అనుగ్రహం చూపిస్తాడు. అదే సమయంలో ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసా రంగా ప్రవర్తిస్తే.. శని దేవుడు కూడా అతన్ని శిక్షిస్తాడు. ముఖ్యంగా శనివారం రోజున కొన్ని పనులు చేస్తే శనీశ్వరుడికి కోపం వస్తుంది.. అటువంటి వ్యక్తుల జీవితంలో కష్టాలను కల్పిస్తాడు. ఈ రోజు శనివారం రోజున పొరపాటున కూడా చేయకూడని పనులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గడ్డం, జుట్టు, గోర్లు కత్తిరించవద్దు**

హిందూ మత గ్రంథాలలో శనివారం గడ్డం, జుట్టు, గోర్లు కత్తిరించడం నిషేధించబడింది. శనివారం గడ్డం, జుట్టు, గోళ్లు కత్తిరించుకుంటే శని దేవుడు కోపగించుకుంటాడని నమ్మకం. శనివారం ఈ పని ఎవరు చేసినా, శనీశ్వరుడు వారిని ఇబ్బంది పెడతాడు.

**కూతురిని అత్తమామల ఇంటికి పంపకండి.**

శనివారం నాడు తల్లిదండ్రులు తమ కూతురిని అత్తారింటికి పంపకూడదని నమ్ముతారు. శనివారం రోజున కూతురును అత్తమామల ఇంటికి పంపితే..ఆమె వైవాహిక జీవితం బాగా ఉండదని..భార్యాభర్తలు మధ్య వివాదాలు ఏర్పడి విడిపోవడానికి దారితీస్తుందని అంటారు.

# అంజీర్ పాలను రోజూ తాగితే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?

అంజీర్ పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో ఏ సీజన్‌లో అయినా సరే లభిస్తుంటాయి. అంజీర్ పండ్లను వాటి రూపం కారణంగా చాలా మంది తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఈ పండ్లను తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అంజీర్ పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో ఏ సీజన్‌లో అయినా సరే లభిస్తుంటాయి. అంజీర్ పండ్లను వాటి రూపం కారణంగా చాలా మంది తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఈ పండ్లను తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అంజీర్ డ్రై ఫ్రూట్స్‌ను నేరుగా తినలేరు. కనుక వీటిని నీటిలో నానబెట్టి తినాల్సి ఉంటుంది. అయితే ఇలా కూడా వద్దనుకునే వారు వీటిని పేస్ట్‌లా చేసి పాలలో వేసి మరిగించి తాగవచ్చు. ఇలా అంజీర్ కలిపిన పాలను తాగడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఈ పాలు మనకు శక్తినిచ్చే సహజసిద్ధమైన డ్రింక్‌లా పనిచేస్తాయి. అంజీర్ పాలను తాగడం వల్ల అనేక రకాల వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చు. అంజీర్ పాలలో అనేక పోషకాలు సైతం ఉంటాయి.

**ఎముకలు, దంతాల ఆరోగ్యానికి..**

అంజీర్ పాలలో క్యాల్షియం, ఫాస్ఫరస్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. అంజీర్ పాలను తాగడం వల్ల ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. రోజూ ఈ పాలను సేవిస్తుంటే ఎముకల సాంద్రత పెరుగుతుంది. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే ఆస్టియో పోరోసిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. అంజీర్ పాలలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఈ పాలలో లభిస్తాయి. పోషకాహార లోపంతో బాధపడుతున్నవారు ఈ పాలను తాగితే ప్రయోజనం ఉంటుంది. దీంతో పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు.




**జీర్ణ వ్యవస్థకు..**

అంజీర్ పాలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంతో అజీర్తి ఉండదు. మలబద్ధకం నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. అంజీర్ పాలను తాగడం వల్ల రోజూ సుఖ విరేచనం అవుతుంది. టాయిలెట్‌లో గంటల తరబడి గడపాల్సిన అవసరం ఉండదు. పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. జీర్ణ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. అంజీర్ పాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పాలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరా మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ అవుతుంది. హైబీపీ ఉన్నవారు అంజీర్ పాలను తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**షుగర్ లెవల్స్ తగ్గేందుకు..**

అంజీర్ పాలలో చక్కెర కలపకుండా తాగవచ్చు. ఎంతో రుచిగా ఉంటాయి. పైగా ఈ పాల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. అంటే ఈ పాలను తాగితే షుగర్ లెవల్స్ పెరగవు సరికదా ఈ పాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచుతాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఈ పాలు ఎంతో మేలు చేస్తాయి. షుగర్ ఉన్నవారు అంజీర్ పాలను తాగుతుంటే ఎంతో మేలు పొందవచ్చు. అధిక బరువు ఉన్నవారికి కూడా అంజీర్ పాలు మేలు చేస్తా యి. బరువు తగ్గేందుకు ఈ పాలు ఉపయో గపడతాయి. కొవ్వు తీసిన పాలలో అంజీర్‌ను వేసి మరిగించి తాగితే మంచిది. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం తక్కువగా తీసుకుంటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. ఇలా అంజీర్‌ను పాలలో వేసి మరిగించి తాగితే అనేక లాభాలను పొందవచ్చు.

# ఖర్జూరాలు, నెయ్యిని కలిపి తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..? ఆశ్చర్యపోతారు..!



ఖర్జూర పండ్లు అంటే చాలా మందికి ఇష్టమే. ఈ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటి తియ్యని రుచి కారణంగా చిన్నారులు కూడా ఈ పండ్లను ఇష్టపడుతుంటారు. ఖర్జూర పండ్లను చాలా మంది స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఖర్జూర పండ్లు అంటే చాలా మందికి ఇష్టమే. ఈ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటి తియ్యని రుచి కారణంగా చిన్నారులు కూడా ఈ పండ్లను ఇష్టపడుతుంటారు. ఖర్జూర పండ్లను చాలా మంది స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఈ పండ్లతో పలు రకాల డ్రింక్స్‌ను కూడా తయారు చేసి తాగుతుంటారు. అయితే ఖర్జూరాలను రోజూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ పండ్లను రోజూ 3 చొప్పున తీసుకుని నెయ్యిలో ఒక రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటే అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు. ఖర్జూరాలను ఈ విధంగా తీసుకోవడం వల్ల పలు వ్యాధులు నయమవడమే కాదు, పోషణ కూడా లభిస్తుందని చెబుతున్నారు.

**హార్మోన్ సమస్యలకు..**

ఖర్జూరాల్లో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటా యి. అలాగే నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వు లు ఉంటాయి. అందువల్ల ఈ రెండింటిని కలిపి తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తు ంది. దీంతో యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పని చేస్తారు. ఎక్కువ సేపు ఉన్నా అలసట రాదు. ఎంత పని చేసినా అలసిపోకుండా ఉంటారు. నీరసం, నిస్సత్తువ దరి చేరవు. ఉదయం నిద్ర లేవగానే నీరసంగా ఉంటుందని భావించే వారు ఈ మిశ్రమాన్ని తీసుకుంటే రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచే సుకోవచ్చు. ఖర్జూర పండ్లలో ఉండే సహజసి ద్ధమైన చక్కెరలు హార్మోన్లను నియంత్రి స్తాయి. అందువ ల్ల హార్మోన్ సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నెయ్యి లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో హార్మోన్ల సమస్యలు ఉన్నవారు ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. రోగాల నుంచి విముక్తి లభిస్తుంది.

**రక్తహీనత తగ్గుతుంది..**

ఖర్జూరాల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. నెయ్యితో కలిపి ఖర్జూరాలను తింటే శరీరం ఐరన్‌ను అధికంగా శోషించుకుంటుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. ఖర్జూరాలు, నెయ్యి మిశ్రమం మన చర్మానికి అవసరం అయిన పోషకాలను అందిస్తుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు కనబడవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. ఖర్జూరాల్లో అనేక పోషకాలు ఉంటాయి. వీటిల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. వీటిని నెయ్యితో కలిపి తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

ఖర్జూరాలలో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఖర్జూరాల్లో ఉండే ఫైబర్ శరీరానికి పోషకాలు అందేలా చూస్తుంది. నెయ్యితో కలిపి వీటిని తినడం వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. ఖర్జూరాల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకం తగ్గేలా చేస్తుంది. నెయ్యి సహజ సిద్ధమైన లాక్సేటివ్ గా పనిచేస్తుంది. దీని వల్ల మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. నెయ్యి, ఖర్జూరాల మిశ్రమం గుండెకు ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరాల్లో ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. నెయ్యితో కలిపి ఖర్జూరాలను తింటే బీపీ నియంత్రణలోకి వచ్చి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా ఈ రెండింటి మిశ్రమంతో ఎన్నో లాభాలు కలుగుతాయివీ

# ఇంద్రాది దేవతల దుస్థితిని చూసిన ఇతర దేవతలు ఏం చేశారంటే.

పారిజాత పువ్వులను కోస్తూ ఇంద్రాది దేవతలంతా శ్రీహరి నిర్మాల్యాన్ని తొక్కి కుంటివారుగా మారిన కథ గురించి తెలుసుకున్నాం కదా. వారంతా తమ వాహనాలు సైతం కదలకపోవడంతో స్వర్గానికి పోలేక అక్కడే ఉండిపోయారు. ఇంతలో సత్రజిత్తు పుష్పవాటికకు వచ్చాడు. అక్కడ కుంటివారై కదల్లేని స్థితిలో ఉన్న ఇంద్రాది దేవతలను చూసి ఆశ్చర్యపోయాడు. మీరు కేవలం పారిజాత పూల కోసం వచ్చి ఇటువంటి దురవస్థకు లోనవడం ఆశ్చర్యంగా ఉందనడంతో దేవతలంతా సిగ్గుతో తలవంచుకున్నారు. ఇక తాను చేసేదేమి లేక సత్రజిత్తు తన కుటీరానికి వెళ్లిపోయాడు. కానీ దేవతలు మాత్రం ఆకలికి అలమటిస్తూ కుంటివాళ్లుగా మరి నరకయాతన పడసాగారు. ఇలాగే ఒక్కరోజు కాదు.. 10 రోజులు గడిచింది. ఆహారం లేక దేవతలు క్రుంగి కృశించి మూర్ఛపోయారు. అప్పుడు దేవతలకు కలిగిన ఈ దురవస్థను చింతించిన సత్వజిత్తు పారిజాత వృక్షం దగ్గరకు వెళ్లాడు. దాని కింద ఉన్న విష్ణు నిర్మాల్యాన్ని శుభ్రంగా తుడిచాడు. అనంతరం దేవతల దురావస్థను తొలగించడం కోసం తన భార్యతో కలిసి ఉపవాసం చేసాడు. స్వర్గంలో మిగిలిన దేవతలంతా ఇద్రాది దేవతలను వెదుకుతూ భూలోకానికి వచ్చారు. సత్వజిత్తు పుష్పవాటికకు వచ్చి ఇంద్రాది దేవతల దువస్థను చూసి ఆగ్రహంతో పారిజాత వృక్షాన్ని పెకలించారు. కానీ ఎంత బలం ఉపయోగించి నా పారిజాత వృక్షాన్ని మాత్రం కదపలేక పోయారు. ఆ తరువాత ఏం జరిగిందో తదుపరి కథనంలో తెలుసుకుందాం.



# బ్యాటింగ్, బౌలింగ్‌లో టీమిండియా ఫ్లాప్ పొట్టి సిరీస్‌లో ఆస్ట్రేలియా బోణీ






ఆసియా కప్ ఛాంపియన్‌గా తొలి టీ20 సిరీస్ ఆడుతున్న భారత్‌కు ఆస్ట్రేలియా షాకిచ్చింది. తొలి టీ20 వర్షార్పణం కాగా రెండో టీ20లో విజయంతో బోణీ కొట్లాలనుకున్న టీమిండి యాకు చెక్ పెట్టింది. హేజిల్‌వుడ్(3-13) విజృ ంభణతో ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేయగా.. ఓపెనర్ అభిషేక్ శర్మ (68), హర్షిత్ రానా(37) అర్ధ శతకంతో పోరాడగలిగే స్కోర్ అందిం చాడు. మిచెల్ మార్ష్(46) మెరుపులతో విజయానికి చేరువైన ఆసీస్‌ను ఆఖర్లో జస్ప్రీత్ బుమ్రా(2-26) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్లో మార్కస్ స్టోయినిస్(6 నాటౌట్) రెండు పరుగులు తీయగా ఆతిథ్య జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో టీ20 సిరీస్‌లో 1-0తో ఆధిక్య ంలోకి దూసుకెళ్లింది.వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు పొట్టి సిరీస్‌ను ఓటమితో ఆరంభించింది. తొలి మ్యాచ్ వరుణుడి ఖాతాలో చేరి వన్డే సిరీస్ చేజారినా పొట్టి కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్న టీమిండియాను ఆస్ట్రేలియా 130లోపు కట్టడి చేసింది. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించిన ఆసీస్ టీ20 సిరీస్‌లో ఘనంగా బోణీ కొట్టింది.వన్డేల్లో భారత్‌ను దెబ్బకొట్టిన జోష్ హేజిల్‌వుడ్(3-13) సంచలన బౌలింగ్‌తో టాపార్డర్‌ను కూప్పకూ ల్చాడు. 49 పరుగులకే ఐదు వికెట్లు పడిన వేళ ఓపెనర్ అభిషేక్ శర్మ(68), హర్షిత్ రానా(37)లు జట్టును ఆదుకున్నారు. కానీ, గ్జావియర్ బార్ట్‌లెట్ ఓవర్లో రానా ఔట్ కాగా.. అర్ధ శతకంతో జోరు మీదున్న అభిషేక్‌ను నాథన్ ఎల్లిస్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత శివం దూబే(4) నిరాశపరచగా బుమ్రా రనౌట్ కావడ ంతో టీమిండియా 125 పరుగులకే ఆలౌటయ్యింది.హాఫ్ సెంచరీ భాగస్వా మ్యంటీమిండియాకు కట్టడి చేసిన ఆస్ట్రేలియా దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(46), మిచెల్ మార్ష్(28)లు ధనాధన్ ఆటతో స్కోర్‌బోర్డును ఉరికించారు. పవర్ ప్లే పూర్తికాకముందే హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి గట్టి పునాది వేశారు. ఎడాపెడా దంచేస్తున్న హెడ్‌ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ.. జోష్ ఇంగ్లిస్ (20) జతగా మార్ష్ చెలరేగిపోయి లక్ష్యాన్ని కరిగించాడు. భారీ సిక్సర్లు బాదుతున్న మార్ష్‌ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు. కాసేపటికే హిట్టర్ టిమ్ డేవిడ్(1)ను వరుణ్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. అప్పటికీ విజయానికి 27 రన్స్ కావాలంతే.మరో వికెట్ పడకుండానే లక్ష్యాన్ని అందుకునేలా కనిపించిన ఆసీస్‌ను కుల్దీప్, బుమ్రా దెబ్బకొట్టారు. ఇంగ్లిస్‌ను కుల్దీప్ ఎల్బీగా ఔట్ చేసినా.. మిచెల్ ఓవెన్(14) క్రీజులో ఉండడంతో అతడే మ్యాచ్‌ను ముగిస్తాడని ఆతిథ్య జట్టు భావించింది కానీ, బుమ్రా 13వ ఓవర్లో వరుస బంతుల్లో ఓవెన్, మాథ్యూ షార్ట్(0)లను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ.. బార్ట్‌లెట్ హ్యాట్రిక్‌ను అడ్డుకున్నాడు. ఆ తర్వాత కుల్దీప్ ఓవర్లో రెండు రన్స్ తీసిన స్టోయినిస్(6 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. మరో 30-40 రన్స్ చేసి ఉంటే.. లేదా పవర్ ప్లేలో ధారాళంగా పరుగులు ఇవ్వకపోయి ఉంటే కచ్చితంగా టీమిండియాకు అవకాశాలు ఉండేవి మూడో టీ20 నవంబర్ 2 ఆదివారం రోజున జరుగనుంది.

# ఈ కంపెనీ సంచలన నిర్ణయం 48,000 మంది ఉద్యోగుల తొలగింపు



లాజిస్టిక్స్ దిగ్గజం యుపిఎస్ గత సంవత్సరం నుండి 48,000 మంది ఉద్యోగులను తొలగించింది. లాభాలను పెంచడానికి, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడానికి యుపిఎస్ ఈ చర్య తీసుకుంది. యుపిఎస్ స్వయంగా పెద్ద ఎత్తున తొలగింపులను ప్రకటించింది. ఈ 48,000 మంది ఉద్యోగులు కంపెనీ శ్రామిక శక్తిలో 10 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ప్రారంభంలో %ఖూూ%లో 500,000 మంది ఉద్యోగులు ఉన్నారు. 2024లో నిర్వహణ బృందంలో 14,000 మందిని తొలగించారు. ఈ సంవత్సరం (2025) డ్రైవర్, గిడ్డంగి విభాగాలలో 34,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు.అమెరికాలోని అట్లాంటాలో ప్రధాన కార్యాలయం కలిగిన యుపిఎస్ (యునైటెడ్ పార్సెల్ సర్వీస్) ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలలో ఒకటి. ఇది గత 120 సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న లాజిస్టిక్స్ కంపెనీ, షిప్పింగ్, కొరియర్ సేవలను అందిస్తుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కొరియర్ కంపెనీ కూడా, 200 కంటే ఎక్కువ దేశాలకు వస్తువులను రవాణా చేసే వ్యవస్థతో ఇది అమెజాన్‌తో డెలివరీ భాగస్వామ్యాన్ని కూడా కలిగి ఉంది.లో ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగాల తొలగింపులు ఎందుకు?ఉద్యోగాల కోత ఉన్నప్పటికీ, మూడవ త్రైమాసికంలో %వి%1.3 బిలియన్ల నికర ఆదాయాన్ని నమోదు చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో %వి%1.5 బిలియన్ల కంటే కొంచెం తక్కువ. ఆదాయం ఏడాది క్రితం %వి%22.2 బిలియన్ల నుండి %వి%21.4 బిలియన్లకు చేరుకుంది. నెట్‌వర్క్ అంతటా సామర్థ్యంపై పనిచేయడం, ఖర్చులను తగ్గించడంపై ఇప్పుడు దృష్టి సారించామని టోమ్ విశ్లేషకులకు చెప్పారు. ఈ కారణంగా, లాభదాయక వ్యాపారాలను తొలగిస్తూ, ఇతర విభాగాలలో కొన్ని నిర్మాణాత్మక మార్పులు చేస్తోంది. దీని ఫలితంగా 48,000 ఉద్యోగాలు కోల్పోయాయి. అమెజాన్‌తో దాని డెలివరీ భాగస్వామ్యాన్ని కూడా తగ్గించుకుంది.

# మహిళలకు షాకిచ్చిన పసిడి రూ.1200 పెరిగిన బంగారం ధర



గత ఐదారు రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఈ రోజు ఉదయం నిలకడగా ఉన్న పసిడి ధరలు.. 9 గంటల సమయానికి తులం బంగారం ధరపై ఏకంగా రూ.1200 వరకు ఎగబాకింది. అలాగే వెండి ధరల్లో ఏ మాత్రం మార్పులేదు. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,680 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,12,450 వద్ద కొనసాగుతోంది. అయితే దేశీయంగా కిలో వెండి ధర రూ.1,51,000 ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో తులం బంగారం ధర రూ.1,22,680 ఉండగా, కిలో వెండి ధర రూ.1,65,000 ఉంది.ఇదిలా ఉండగా, ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారతదేశంలో బంగారం డిమాండ్ బాగా తగ్గింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక ప్రకారం, మొత్తం బంగారం డిమాండ్ 16 శాతం తగ్గి 209.4 టన్నులకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 248.3 టన్నులు. అధిక బంగారం ధరల కారణంగా వినియోగదారుల కొనుగోళ్లు తగ్గడం వల్ల ఈ తగ్గుదల ప్రధానంగా జరిగింది. అయితే, విలువ పరంగా, డిమాండ్ రూ.165,380 కోట్ల నుండి రూ.203,240 కోట్లకు పెరిగింది. ఇది 23 శాతం పెరుగుదల. దీని అర్థం ప్రజలు తక్కువ పరిమాణంలో బంగారాన్ని కొనుగోలు చేసినప్పటికీ, అధిక ధరలు మొత్తం ఖర్చును పెంచాయి.ఇది కూడా చదవండి:: మీరు పదేళ్ల తర్వాత ఒక కంపెనీని వదిలివేస్తే పెన్షన్ వస్తుందా? నియమాలు ఏంటి?బంగారానికి డిమాండ్ ఎందుకు తగ్గింది?గత ఏడాది 171.6 టన్నులుగా ఉన్న బంగారు ఆభరణాల డిమాండ్ ఈ త్రైమాసికంలో కేవలం 117.7 టన్నులకు పడిపోయింది. ఇది దాదాపు 31 శాతం తగ్గుదల. అయితే కొనుగోలుదారులు పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకుని తమ బడ్జెట్‌లను సర్దుబాటు చేసుకోవడంతో ఆభరణాల కొనుగోళ్ల మొత్తం విలువ దాదాపు రూ.1,14,270 కోట్ల వద్ద స్థిరంగా ఉంది. మరోవైపు, పెట్టుబడిగా బ ంగారం డిమాండ్ గణనీయంగా పెరిగింది. పరిమాణం పరంగా ఇది 20 శాతం పెరిగి 91.6 టన్నులకు చేరుకోగా, విలువ పరంగా ఇది 74 శా తం పెరిగి రూ.51,080 కోట్ల నుండి రూ.88,970 కోట్లకు చేరుకుంది.

# భారత్ ఆస్ట్రేలియా రెండో టీ20 మెల్‌బోర్న్‌లో రికార్డులు ఏం చెబుతున్నాయంటే



భారత్, ఆస్ట్రేలియా మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్ కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్‌లో జరిగింది. అయితే వర్షం కారణంగా రద్దయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకుంది. కానీ, భారత ఇన్నింగ్స్‌లో కేవలం 9.4 ఓవర్లు మాత్రమే ఆడగలిగారు. ఈ సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ రద్దయింది. ఇప్పుడు ఇరు జట్ల మధ్య ఈ సిరీస్‌లోని రెండో టీ20 మ్యాచ్ చారిత్రాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్లో నేడు జరగనుంది. వన్డే సిరీస్ కోల్పోయిన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌పై దృష్టి సారించింది. నేటి మ్యాచ్ గెలవాలని భావిస్తోంది. రెండో టీ20 మ్యాచ్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. భారత కాలమానం ప్రకారం మ్యాచ్ మధ్యాహ్నం 1:45 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ అరగంట ముందు, మధ్యాహ్నం 1:15 గంటలకు జరుగుతుంది. మొదటి మ్యాచ్ రద్దైనందున ప్రస్తుతం నాలుగు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. నేటి మ్యాచ్‌లో ఏ జట్టు గెలిచినా సిరీస్ గెలిచే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. కాబట్టి, ఇరు జట్లు నేటి మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత చారిత్రాత్మక మైదానాలలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ మైదానంలో ఆటగాళ్లు పెద్ద షాట్లు కొట్టడం అంత సులభం కాదు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో హెడ్-టు-హెడ్ రికార్డు విషయానికొస్తే, ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. భారత్ రెండు మ్యాచ్‌లు గెలిచింది. ఆతిథ్య ఆస్ట్రేలియా కేవలం ఒక మ్యాచ్ గెలిచింది, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.భారత్, ఆస్ట్రేలియా మధ్య మొదటి టీ20 మ్యాచ్ 2008లో మెల్‌బోర్న్ మైదానంలో జరిగింది. అందులో ఆస్ట్రేలియా జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. ఆ తర్వాత భారత జట్టు 2012, 2016లో ఆడిన టీ20 మ్యాచ్‌లను గెలిచింది. అయితే 2018లో జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత జట్టు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అద్భుతమైన రికార్డును కలిగి ఉంది. వారు ఆతిథ్య జట్టుతో నాలుగు మ్యాచ్‌లు, జింబాబ్వే, పాకిస్తాన్‌తో మ్యాచ్‌లు ఆడారు. ఈ రెండు మ్యాచ్‌లలో టీమ్ ఇండియా గెలిచింది. ఇక్కడ ఆడిన ఆరు మ్యాచ్‌లలో, భారత జట్టు నాలుగు గెలిచింది. కేవలం ఒక మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది. ఈలోగా ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 15 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. తొమ్మిది గెలిచి ఐదు ఓడిపోయింది. నేటి మ్యాచ్‌కు ఇరు జట్లలో మార్పులు అనుమానమే. మునుపటి మ్యాచ్‌లో ఆడిన ఆటగాళ్లే నేడు కూడా బరిలోకి దిగనున్నారు.

# రూ.500 నోటుపై ఈ గుర్తు ఉంటే, అది ఖచ్చితంగా నకిలీదే




భారతదేశంలో రూ.2,000 నోట్ల రద్దు అనంతరం కొత్త రూ.500 నోటుకు సంబంధించి నకిలీ నోట్ల చెలామణి ఎక్కువగా పెరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం, ప్రస్తుతం దేశంలో చెలామణిలో ఉన్న అత్యంత నకిలీ కరెన్సీ రూ.500 నోటు అని చెప్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ సిరీస్ రూ. 500 నకిలీ నోట్ల సంఖ్య 1,17,722 కు పెరిగింది. గత సంవత్సరాల్లో గుర్తించిన సంఖ్యతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 91,110 నకిలీ నోట్లు గుర్తించబడ్డాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 85,711 నకిలీ నోట్లు గుర్తించబడ్డాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 నకిలీ నోట్లు గుర్తించబడ్డాయి.చలామణి నుంచి ఉపసంహరించుకున్న నకిలీ రూ.2,000 నోట్ల సంఖ్య తగ్గిన తర్వాత, నకిలీ రూ.500 నోట్ల సంఖ్య పెరిగింది. వాటిని చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పుడు నకిలీ రూ.2,000 నోట్ల ప్రసరణ గరిష్ట స్థాయికి చేరుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 9,806గా ఉన్న నకిలీ రూ.2,000 నోట్ల సంఖ్య 2023-24 ఆర్థిక సంవత్సరంలో 26,035కి పెరిగింది. అయితే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 3,508కి బాగా తగ్గింది. నకిలీ నోట్లు తయారు చేస్తున్న కేటుగాళు తమ దృష్టిని చలామణిలో లేని రూ.2,000 నోట్ల నుండి విస్తృతంగా చెలామణిలోకి వచ్చిన రూ.500 నోట్ల వైపు మళ్లించారని ఈ డేటా చూపిస్తుంది.చిన్న డినామినేషన్ నోట్లలో భిన్నమైన ధోరణి కనిపించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో నకిలీ రూ.100 నోట్ల సంఖ్య 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,10,736 నుండి 51,069కి తగ్గింది. అదే సమయంలో నకిలీ రూ.200 నోట్ల సంఖ్య అదే కాలంలో 24,245 నుండి 32,660కి పెరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అన్ని డినామినేషన్ల నకిలీ నోట్లు కనుగొనబడ్డాయి. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,17,396కి కొద్దిగా తగ్గింది. అయితే, ఇప్పుడు కొత్త సిరీస్ రూ.500 నోట్లు నకిలీ కరెన్సీ చెలామణిలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అయితే, పాత మహాత్మా గాంధీ సిరీస్ రూ.500 నోట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐదుసార్లు మాత్రమే గుర్తించబడ్డాయి. అవి దాదాపు చెలామణి నుండి అదృశ్యమయ్యాయి.నకిలీ నోట్ల చెలామణిని నియంత్రించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ (%=దీ×%) సహకారంతో కరెన్సీ నోట్ల భద్రతా లక్షణాలను నిరంతరం సమీక్షిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934లోని సెక్షన్ 25 ప్రకారం, నకిలీల నుండి ముందుండడానికి కొత్త డిజైన్లు, భద్రతా మెరుగుదలలను ప్రవేశపెట్టడం నిరంతర ప్రక్రియ అని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# కేకేఆర్‌లోకి రోహిత్ శర్మ




ఐపీఎల్ 20262026) సమీపిస్తోంది. ప్రస్తుతం అందరిలో ఒకటే ప్రశ్న.. రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్‌ను వీడి కేకేఆర్‌లో చేరనున్నా డా?. అయితే ఐపీఎల్ 2026కి ముందు కేకేఆర్ చేసిన ఓ సోషల్ మీడి యా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. రోహిత్అత్యంత సన్నిహితుడు.. తాజాగా కేకేఆర్ హెడ్ కోచ్‌గా నియమితుడైన అభిషేక్ నాయర్ మార్గదర్శకత్వంలో రోహిత్ కేకేఆర్‌లో ఆడే అవకాశాలు లేకపోలేదని అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారుఈ వార్తలన్నీ జోరుగా ప్రచారం అవుతున్న నేపథ్యంలో.. ముంబై ఇండియన్స్ కూడా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'సూర్యుడు మళ్లీ రేపు ఉదయిస్తాడు. కానీ రాత్రిపూట ఉదయించడం అసాధ్యం!' అని పేర్కొంది. ఈ పోస్ట్ బట్టి రోహిత్ శర్మ ముంబైని వదిలి వెళ్లడం అసాధ్యం అని అభిమానులు అనుకుంటున్నారు. మరోవైపు రోహిత్ శర్మ, అభిషేక్ నాయర్ స్నేహం కూడా ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. అభిషేక్ రోహిత్‌కు ఫిట్‌నెస్ ట్రైనింగ్‌లో గైడ్ చేశాడు. నాయర్ సూచనలతో జిమ్‌లో కసరత్తులు చేసి హిట్‌మ్యాన్ ఏకంగా పది కిలోల బరువు తగ్గి అద్భుత ఫామ్‌ను తిరిగి సాధించారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీ సాధించి అదరగొట్టాడు. ఈ ఫామ్‌తో రోహిత్ తొలిసారిగా ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు.వన్డే నంబర్ 1 బ్యాటర్..ఈ నేపథ్యంలో కేకేఆర్ తన ఎక్స్ ఖాతాలో రోహిత్ శర్మకు శుభాకాంక్షలు తెలియజేసింది. 'మీరు ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నారు.. దీనికి మీరు అర్హులు, అభినందనలు రోహిత్' అంటూ పేర్కొంది. అయితే ఒక అభిమాని ఆ పోస్ట్‌కి 'అయితే కన్ఫామ్ అనుకోవచ్చా..?' అని కామెంట్ చేయగా కేకేఆర్ స్పందించింది. 'నంబర్ 1 వన్డే బ్యాటర్ కన్ఫామ్' అంటూ సమాధానం ఇచ్చింది. ఆ వ్యక్తి వెంటనే 'అంటే హిట్‌మ్యాన్ కేకేఆర్‌లో చేరినట్టే..' అని రిప్లై ఇవ్వడంతో ఈ సంభాషణ క్షణాల్లోనే వైరల్ అయింది. అయితే ఇప్పటివరకు రోహిత్ శర్మ ఈ అంశంపై అధికారికంగా స్పందించలేదు. కానీ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందే ఆటగాళ్ల రిటెన్షన్, వేలం సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత వేడెక్కుతున్నాయి. రోహిత్ నిజంగా పర్పుల్ జెర్సీలో కనిపిస్తారా..? లేక మళ్లీ బ్లూ జెర్సీలోనే మెరుస్తాడా..? అనేది ఆసక్తికరంగా మారింది.

# సీఎం రేవంత్ రెడ్డితో బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ భేటీ



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. గురువారం సాయంత్రం ముంబైలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానని సల్మాన్ ఖాన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో వీరిద్దరి మధ్య జరిగిన చర్చల పూర్తి వివరాలు బయటకు రానప్పటికీ, తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో ఇనుమడింపజేసే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ.. (తెలంగాణ రైజింగ్) అనే సందేశాన్ని ప్రపంచ నలుమూలలకూ తీసుకెళ్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడం ఇది రెండోసారి. గత జులై నెలలో ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ముఖ్యమంత్రిని కలిసి, రాష్ట్ర ప్రభుత్వ జ్యూరీ అవార్డు ప్రకటించినందుకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖుల ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచడంలో భాగంగానే ఈ సమావేశాలు జరుగుతున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# సక్సెస్ అయితే సీనియర్లకు మంచి ఆప్షనే!



సీనియర్ హీరోలకు హీరోయిన్లు ఎంపిక అన్నది ఎంత కష్టంగా మారుతుందో చెప్పాల్సిన పనిలేదు. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి స్టార్లకు హీరోయిన్లు సెట్ చేయడం ప్రతీసారి సమస్యగా మారుతోంది. దీంతో తీసుకున్న వారినే మళ్లీ మళ్లీ తీసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో నయనతార, త్రిషలనే రిపీట్ చేయాల్సిన సన్నివేశం ప్రతీసారి కనిపిస్తోంది. అనుష్క లాంటి 40 ఏళ్లు దాటి నటి ఉన్నా? దర్శకులు ఎందుకనో ఆమెవైపు చూడటం లేదు. మిల్కీ బ్యూటీ తమన్నా కూడా సీరియర్లకు సై అంటున్నా? ఆమెని కూడా అశ్రద్ధ చేస్తున్నారు. కన్నడిగి మరో ఆప్షన్ గా: తప్పదు అనుకుంటే? తప్ప మిల్కీ వైపు ఎవరూ వెళ్లడం లేదు. ఆమెను ఓ ఐటం భామగానే పరిమితం చేస్తున్నారు. ఆషికా రంగనాథ్, సంయుక్తా మీనన్ లాంటి వారు మరిన్ని సక్సస్ లు అందుకుంటే? సీనియర్లకు సరితూగుతారు. ప్రస్తుతం ఈ భామలు సీనియర్లతో కొన్ని సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాళ్ల సరసన చేరడా నికి కన్నడిగి శ్రీనిధి శెట్టి కూడా సిద్దంగా ఉంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఏరికోరి మరీ ఎంపిక చేసారు: గురూజీ చాలా మంది భామల్ని పరిశీలించి చివరిగా ఆ ఛాన్స్ శెట్టి బ్యూటీకి ఇచ్చారు. ఈ బ్యూటీ తెలుగింట ఇప్పుడి ప్పుడే ఫేమస్ అవుతుంది. ఇటీవల రిలీజ్ అయిన %-%హిట్ 3%-% తో మంచి హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ అమ్మడు కూడా అందాల ఆరబోత కంటే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలే చేస్తుంది. గురూజీ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలకు పెద్ద పీట వేస్తారు. హీరోకు ధీటుగా హీరోయిన్ పాత్రలను డిజైన్ చేస్తారు. శ్రీనిధి పెర్ఫార్మర్ కావడంతో ఏరికోరి మరీ ఎంపిక చేసారు. ఆయన చేతుల్లో పడ్డ హీరోయిన్లు కూడా వెలుగులోకి వచ్చారు. గ్లామర్ పాత్రలకు నో: ఈ సినిమా హిట్ అయితే గనుక శ్రీనిధికి మంచి పేరు వస్తుంది. అవకాశాలు పెరుగుతాయి. యువ హీరోలతో పాటు, సీనియర్ హీరోలకు శ్రీనిధి మంచి ఆప్షన్ గా మారుతుంది. కెరీర్ పరంగా శ్రీనిధి గురూజీ ఇచ్చిన అవకాశాన్ని గొప్పగా భావిస్తోంది. ఇతర భాషల్లో కొన్ని చిత్రాల్లో గ్లామర్ పాత్రల్లో నటించాలని చాలా అవకాశాలు వచ్చినా? శ్రీనిధి వాటిని సున్నితంగా తిరస్కరించింది. ప్రస్తుతం తెలుగు సినిమాలపై దృష్టి పెట్టి పని చేస్తోంది.

# డాడ్ ఫ్రెండ్ ప్రోత్సాహంతో హీరోయిన్ గా!



మాలీవుడ్ బ్యూటీ మమితా బైజు టాలీవుడ్ లో సినిమాలు చేయకముందే యువతలో ఫాలోయింగ్ సంపాదించిన బ్యూటీ. మాలీవుడ్ అనువాద చిత్రం %-%ప్రేమలు%-%తోనే బోలెడంత ఫేమస్ అయిపోయింది. అప్పటి నుంచి అమ్మడికి యువతలో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇటీవల రిలీజ్ అయిన డ్యూడ్ తోనూ మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇందులో అమ్మడు ప్రదీప్ రంగనాథ్ కు జోడీగా నటించి మెప్పించింది. ఈ సినిమా ఇప్పటికే 100 కోట్ల క్లబ్ లో చేరింది. తమిళ సినిమా అయినా తెలుగు ప్రేక్షకులకు బ్రహ్మరథం పట్టడంతో ఇంత పెద్ద విజయం సాధ్యమైంది. డాక్టర్ కాబోయి యాక్టర్: దీంతో మమిత పేరు మరోసారి నెట్టింట ట్రెండింగ్ లో నిలిచింది. ఇక తెలుగు లో అవకాశాలు రావడం పెద్ద విషయం కాదు. ఇప్పటికే కొన్ని అవకాశాలు కూడా వచ్చినా రిజెక్ట్ చేసింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే పోషించాలి అనే కండీషన్ తో పని చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశాలను మమిత రిజెక్ట్ చేసినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ బ్యూటీ గురించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మమితా బైజు తండ్రి డాక్టర్. సొంతంగా ఓ క్లినిక్ కూడా ఉంది. %యాశ్రీంశీ =ఘుఒ% - విశాల్ సినిమాకు డైరెక్టర్స్ అసోసియేషన్ చెక్..! బేబి డాక్టర్ గా ఫేమస్: మమిత క్లినిక్ కి వెళ్లిన సమయంలో బేబి డాక్టర్ అని పిలిచేవారట. రోగం నయం అయిన తర్వాత పేషెంట్లు తండ్రికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చిన వారిని చూసి ఓ కుమార్తెగా తానెంతో గర్వపడేదాన్ని అన్నారు. ఆ కారణంతో తాను కూడా తండ్రిలా డాక్టర్ అవ్వాలని కలలు కనేదట. కానీ అనుకోకుండా సినిమాల్లోకి రావడంతో ఆ కల చెదిరి పోయిందంది. 9వ తరగతి చదువుకుంటోన్న సమయంలో సర్వోపరి బాలక్కాన్ సినిమాలో నటించే అవకాశం వచ్చిందిట. ఆ చిత్రాన్ని నిర్మించేది కూడా తండ్రి స్నేహితుడు కావడంతో అవకాశం ఈజీగా వచ్చిందంది. నటిగా అమ్మడి ప్రయాణమలా: ఆ సినిమా తర్వాత ఆడిషన్ కు వెళ్లమని ప్రోత్సహించేవారుట. అలా వెళ్లడం సహా తొలి సినిమా రిలీజ్ అనంతరం చాలా అవకాశాలు వచ్చాయంది. అలా నెమ్మదిగా నటన అలవాటుగా మారిందంది. నటనంటే చిరాకు పడే మమితా నటనపై ఇష్టం పెంచుకున్నట్లు తెలిపింది. కాలక్రమంలో మ్యాకప్ అలవాటు గా మారడంతో ఇంట్లో ఉన్న సమ యంలో కూడా అప్పుడప్పుడు మ్యాకప్ వేసుకునేదట. అప్పటి నుంచి నటిగా స్థిరపడాలి అనే ఆలోచనతోనే ప్రయాణం మొదలు పెట్టినట్లు తెలిపింది. ఈ బ్యూటీ ఇప్పటి వరకూ మాలీవుడ్ లోనే ఎక్కువ సినిమాలు చేసింది. తమిళ్ లో రెండు..మూడు సినిమాలు చేసింది. ప్రస్తుతం దళపతి విజయ్ హీరోగా నటిస్తోన్న జన నాయగన్ లోనూ నటిస్తోంది.

# హత్య చేసినా ఓకే.. కానీ అబద్ధం చెబితే ఊరుకోను: తమన్నా



ప్రముఖ నటి తమన్నా తన వ్యక్తిగత సంబంధాలు, భాగస్వామిలో ఉండాల్సిన లక్షణాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక బంధంలో తాను ఏ విషయాన్ని అస్సలు సహించలేదో స్పష్టం చేశారు. అబద్ధం చెప్పడం తనకు ఏమాత్రం నచ్చదని, దాన్ని తట్టుకోలేనని కుండబద్దలు కొట్టారు. ఇటీవల 'యువా'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ, "నాకు అబద్ధాలు చెప్పేవాళ్లను చూస్తే అస్సలు సహించలేను. ఏదైనా తప్పు జరిగినా, సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించడానికి నేను సిద్ధంగా ఉంటాను. అవసరమైతే మీరు ఒక హత్య చేసినా దాన్ని కప్పిపుచ్చడానికి నేను సాయం చేస్తానేమో (నవ్వుతూ). కానీ, అబద్ధాలు చెప్పే వారిని మాత్రం నేను భరించలేను" అని అన్నారు. ఆమె ఇంకా వివరిస్తూ, "నా ముఖం మీదే అబద్ధం చెప్పి, దాన్ని నేను నమ్మేంత మూర్ఖురాలిని అని అవతలి వారు అనుకున్నప్పుడు నాకు చాలా కోపం వస్తుంది. సమస్య కేవలం అబద్ధం చెప్పడం కాదు, అవతలి వారు మనల్ని అంత తెలివితక్కువ వారని భావించడమే అసలు సమస్య" అని తమన్నా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. గతంలో తమన్నా, నటుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. 2023లో 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్ ప్రమోషన్ల సమయంలో వీరిద్దరూ తమ సంబంధాన్ని అధికారికంగా

# ట్రంప్ ట్వీట్ ని పబ్లిసిటీకి వాడిన అడివి శేష్..!



కాదేది కవితకు అనర్హం అని అన్నట్టుగా కాదేది సినిమా పబ్లిసిటీకి అనర్హం అని మన తెలుగు యాక్టర్స్ చెబుతున్నారు. వాళ్ల వాడకం ఎలా ఉంది అంటే ఏకంగా సినిమా ప్రమోషన్ కోసం అమెరికా ప్రెసిడెంట్ ని కూడా వాడుతున్నారు. సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం కోసం ఎలాంటి ప్లాట్ ఫాం ని వదలట్లేదు యాక్టర్స్. ఇంతకీ విషయం ఏంటంటే టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ లేటెస్ట్ గా అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ ని తన సినిమా ప్రమోషన్స్ కి వాడుకున్నాడు. ట్రంప్ త్వరలో జీ 2 కన్వినింగ్ ఉంటుందని ఎక్స్ లో పెట్టగా దానికి అడివి శేష్.. జీ 2 మాసివ్ ముందు డెకాయిట్ ఎక్స్ ప్లోషన్ ఉందని రిప్లై ఇచ్చాడు. అడివి శెష్ ఇచ్చిన రిప్లై ట్రంప్ చూసే ఛాన్స్ ఉండకపోవచ్చు కానీ జీ 2 అని ట్రంప్ పెట్టింది అది గూఢచారి 2 అన్నట్టు తను ఫీలి ఇలా డెకాయిట్, జీ 2ల ప్రమోషన్ ని ట్రంప్ ట్వీట్ ద్వాకా వాడటం అది కేవలం అడివి శేష్ వల్లే అయ్యింది. అడివి శేష్ ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్నాడు. అందులో ఒకటి డెకాయిట్ కాగా.. మరొకటి జీ2 అదే గూఢచారి 2. డెకాయిట్ ఒక లవ్ స్టోరీ విత్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమాను షానీల్ డియో డైరెక్ట్ చేస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా అసలైతే డిసెంబర్ 25 క్రిస్మస్ కి రిలీజ్ అనుకున్నారు కానీ ఇప్పుడు ఆ సినిమాను మార్చి 19కి రిలీజ్ వాయిదా వేశారు.

ఇక అడివి శేష్ అండ్ టీం గూఢచారి సీక్వెల్ గా %+%2 కోసం రెండేళ్లుగా షూటింగ్ చేస్తూనే ఉన్నారు. తెలుగు తెర మీద పర్ఫెక్ట్ రా ఏజెంట్ మూవీని చూపించేలా వారి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీ 2 సినిమాలో వామిక గబ్బి హీరోయిన్ గా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు కూడా నెక్ట్స ఇయర్ రిలీజ్ కాబోతున్నాయి. అడివి శేష్ సినిమాలు ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తాయి. కానీ సినిమా సినిమాకు అతను తీసుకునే టైం ఆడియన్స్ కి ఇబ్బంది కలిగిస్తుంది. ఐతే టైం తీసుకున్నా సరే మంచి అవుట్ పుట్ తో ఆడియన్స్ ని మెప్పించాలని ప్రయత్నిస్తాడు అడివి శేష్. మరి డెకాయిట్, జీ 2 ఈ రెండు సినిమాలతో అడివి శేష్ ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి. ఈమధ్య సినిమా తీయడం కన్నా ఆ సినిమా గురించి ఆడియన్స్ లో డిస్కషన్ ఉండేలా చేయడం పెద్ద పనిగా మారింది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com